www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 136 | ఆదివారం | 27.10.2024



## కాళేశ్వరం టెండర్ల ప్రాసెస్ జరగలే!

- వరద వేగాన్ని అంచనా వేయకపోవడం వల్లే బ్లాకులు దెబ్బతిన్నాయి
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరైన సీఈ సుధాకర్ రెడ్డి
- విచారణలో మూడుసార్లు హరీశ్ రావు ప్రస్తావన
- వాప్కోస్‌కు డీపీఆర్ ఇవ్వాలని ఆయనే చెప్పారన్న చీఫ్ ఇంజనీర్
- బిల్లుల ఆలస్యం పై నిలదీసిన కమిషన్
- సుందిళ్ల, అన్నారం ఫైనల్ బిల్లులను నిర్మాణ సంస్థలు ఇచ్చాయని వెల్లడి

2

## మేడారం మహా జాతర తేదీలు ఖరారు

2

# ఉద్యోగులకు గుడ్ న్యూస్

## రెండు డీఏలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- వచ్చే ఏడాది మార్చిలో మరో డీఏ అమలుకు నిర్ణయం
- నాలుగు గంటలు సాగిన మంత్రివర్గ సమావేశం
- సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించిన మంత్రివర్గం
- ములుగు సెంట్రల్ వర్సిటీకి భూమి..
- మెట్రో రైలు విస్తరణ పనులకు పచ్చజెండా
- ఏటూరు నాగారం.. ఇక రెవెన్యూ డివిజన్
- మద్దూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్
- కొత్త పద్ధతిలో పల్లె రోడ్లకు మహర్దశ
- పంచాయతీ రాజ్ శాఖలో పరుగులు పెట్టనున్న రహదారి పనులు
- నవంబర్ 31 లోపు కులగణన చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- కేబినెట్ భేటీ అనంతరం వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:
సన్న వడ్లకు రూ.500 బోనస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శనివారం సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై పలు నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ఈ కేబినెట్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఎన్నికల హామీల అమలు తీరు, మేనిఫెస్టోలోని ఇతర అంశాల మీద కేబినెట్ సమావేశం చర్చించింది. దీనితో పాటు ఇప్పటి వరకు పలు అంశాల

మిగతా 2లో..



## ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

- యూనిఫామ్‌తో రోడ్డెక్కిన పోలీసులు
- మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నిరసన
- ఇబ్రహీంపట్నంలో పోలీస్ కుటుంబాల ధర్నా
- పోలీసుల నిరసనపై డీజీపీ జితేందర్ సీరియస్
- ఆందోళన చేస్తున్నవారిపై చర్యలుంటాయని ఆగ్రహం



## రైతును చితకబాదిన ఏఎస్ఐ

- మునుగోడు ఏఎస్ఐ కోటి సింగ్ వీరంగం
- భూ వివాదం కేసులో రైతుపై రెచ్చిపోయి దాడి
- ఉన్నతాధికారులకు బాధిత కుటుంబం ఫిర్యాదు

2



## కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలి

- 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలు పంపిణీ చేస్తున్నం
- శనిగరం ప్రాజెక్టు వద్ద ఫిష్ మార్కెట్ పెడతాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

2



## 'మెఘా'కు స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ బాధ్యతలు

ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం
ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్యాంపస్ నిర్మాణిస్తాం: మెఘా

ప్రజానావ, హైదరాబాద్:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. ఈ స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మెగా ఇంజినీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థం ముందుకొచ్చింది. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో మెఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలో ఆ కంపెనీ ప్రతినిధుల బృందం సంప్రదింపులు జరిపింది. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ

మిగతా 2లో..

## మీ తాత జాగీరా?

ఇష్టమొచ్చినట్లు భూములు గుంజుకుంటే ఊరుకోం
రేవంత్ సర్కార్‌కు ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరిక



2



## దండుపాళ్యం ముఠాలా ముఖ్యమంత్రి సోదరులు

- రూ.500 కోట్ల విలువైన న్యాయవాది భూములకే ఎసరు పెట్టిండ్రు
- న్యాయం చేయాల్సిన ఖాకీలు.. సీఎం సోదరులతో సెటిల్ చేసుకోమంటారా?
- కమీషన్ల కోసమే కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## మూసీ బ్యూటిఫికేషన్ అవసరమే

- పేదల ఇండ్లు కూల్చకుండా చేయండి
- నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

2






## ఆరేళ్లుగా నో స్కాలర్‌షిప్

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సచివాలయం ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు

2



## హైడ్రా @ 100 డేస్

- జులై 19న జీవో 99 ద్వారా ఏర్పాటు
- 26 నుంచి కూల్చివేతలు షూరు
- వివాదాలను సైతం లెక్కచేయకుండా ముందుకు
- ఇప్పటివరకు 300 పైచిలుకు అక్రమ నిర్మాణాలు నేలమట్టం
- 144 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగింత
- ఇటీవల రాష్ట్ర సర్కార్ విస్తృతాధికారాలు కల్పిస్తూ నిర్ణయం

2

## ఉద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

మీద ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలు, వాటి నివేదికలపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. అనంతరం పలు కీలక అంశాలను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. మద్దూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రి వర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిని పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏటూరు నాగారంను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. సమ్మక్క సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీకి 211 ఎకరాలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలు మార్గాల విస్తరణకు కేబినెట్ ఆమోదించింది. నాగోల్ఎల్బీనగర్హయత్ నగర్, ఎల్బీనగర్శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది.



## మూసీ బ్యూటిఫికేషన్ అవసరమే..

**ప్రజానావ, హైదరాబాద్:**

ప్రపంచంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడిక్ మెట్, ముషీరాబాద్ డివిజన్ లలో రూ. 1 కోటి 35 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియ గౌడ్ లతో కలిసి శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షం పడితే డ్రైనేజి వాటర్ ఇళ్ళలోకి రావడంతో ప్రజలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హైదరాబాద్ నగరంలో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. అనేక బస్తీలు, హైదరాబాద్ చుట్టుపక్కల కాలనీలలో ఓపెన్ డ్రైనేజి ఉంది. ఇంతవరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేయలేదన్నారు. మంజూరైన పనులకు టెండర్లను పిలిస్తే కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. లక్షా యాభై వేల కోట్లతో మూసీ నది బ్యూటిఫికేషన్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెప్తున్నారన్నారు. హైదరాబాద్ కు మూసీ బ్యూటిఫికేషన్ అవసరమే కానీ, పేదవాళ్ల ఇండ్లను తొలగించకూడదన్నారు. బస్తీలల్లో డ్రైనేజి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని చెప్పారు.

## ఆరేళ్లుగా నో స్కాలర్షిప్‌లు



**ప్రజానావ, ఖైరతాబాద్:**


ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు సెక్రటేరియట్‌ను ముట్టడించారు. విద్యా రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అనేక చోట్ల విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టారు. దీంతో సచివాలయం వద్ద ఉద్రిక్తత వాతావరణ చోటుచేసుకంది. పోలీసు వలయాన్ని ఛేదించుకుని రాష్ట్ర పరిపాలనా సౌధంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వెంటనే వారిని అడ్డుకుని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని విద్యార్థులు విమర్శించారు. కంచెలు తొలగించాం అని చెప్పారు కానీ పోలీస్‌లు ఎక్కడికికి అక్కడ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని విద్యార్థులు విమర్శించారు. మీరు అధికారంలోకి రావడానికి తాము ఎంతో కష్టపడ్డమని, ఇప్పుడు విద్య శాఖను గాలికి వదిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై దృష్టి పెట్టాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నేతలు అన్నారు.

## కాళేశ్వరం టెండర్ల ప్రాసెస్ జరగలే!

**ప్రజానావ, హైదరాబాద్:**

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణకు చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి శనివారం హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల టెండర్లపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఆయనను విచారించింది. డీపీఆర్ తయారీ పనులను నామినేషన్ పద్ధతిన వ్యాప్కోస్‌కు అప్పగించినట్లు సుధాకర్‌రెడ్డి కమిషన్‌కు తెలిపారు. తనిఖీలు లేకుండానే మేడిగడ్డ బ్యారేజీకి సబ్‌స్టాన్షియల్ పత్రం ఇచ్చినట్లు అంగీకరించారు. విచారణ సందర్భంగా అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి ఎవరని కమిషన్ ప్రశ్నించింది. దీనికి సుధాకర్‌రెడ్డి.. హరీశ్‌రావు అని సమాధానమిచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఎలాంటి ఆదాయం లేదని సుధాకర్‌రెడ్డి చెప్పారు. వరద వేగాన్ని అంచనా వేయకపోవడం వల్లే బ్లాకులు దెబ్బతిన్నాయని కమిషన్‌కు వివరించారు. హరీశ్ రావు ఇరిగేషన్ మినిస్టర్ గా ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు టెండర్ల ప్రాసెస్ జరిగిందా అని ప్రశ్నించగా టెండరింగ్ ప్రాసెస్ జరగలేదని ఈసీ సుధాకర్ రెడ్డి బదులిచ్చారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో ఫీల్డ్‌లో జరిగిన టెస్టుల రికార్డులను వ్యాప్కోస్ సంస్థకు ఇవ్వమన ఆదేశించారని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఫైనల్ బిల్లులు ఎందుకు ఆలస్యమయ్యాయని కమిషన్ ప్రశ్నించింది. అన్నారం, సుందిళ్ల ఫైనల్ బిల్లులను నిర్మాణ సంస్థలు ఇచ్చాయని, మేడిగడ్డ బ్యారేజీ ఫైనల్ బిల్లులు ఇంకా సబ్మిట్ చేయలేదని చెప్పారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఎలాంటి ఆదాయం లేదని చెప్పిన సుధాకర్ రెడ్డి..





వరద వేగాన్ని అంచనా వేయకపోవడం వల్లే బ్లాకులు దెబ్బతిన్నాయన్నారు.

**బిల్లులు ఎందుకు ఆలస్యం..?**

ఇప్పటికే పలు దఫాలుగా విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ కమిషన్, త్వరలోనే నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుందని సమాచారం. దాని ఆధారంగా కేసులు, అరెస్టులు జరిగే చాన్స్ ఉంది. విచారణలో మాజీ ఈఎన్సీలు, ఇంజినీర్లు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే ప్రాజెక్టులో కుట్రపూరిత చర్యలు, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. దీంతో క్రిమినల్ కేసులు పక్కాగా నమోదయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా శుక్రవారం కమిషన్ జరిపిన విచారణలో కూడా మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కేసీఆర్ పై కీలక ఆరోపణలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు నిర్మించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. వ్యాప్కోస్ తయారు చేసిన కాళేశ్వరం డీపీఆర్ ను ప్రభుత్వం ఆమోదించిందని, ఆనాడు సీఎంగా కేసీఆర్ అనుమతి ఇస్తూ సంతకం చేశారని కమిషన్ ఎదుట చెప్పారు. నిర్మాణం చేపట్టే క్రమంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ ప్రదేశాలను కేసీఆరే మార్చమన్నట్లు తెలిపారు.

## రైతును చితకబాదిన ఏఎస్ఐ

**ప్రజానావ, హైదరాబాద్:**

ప్రజలు, పోలీసుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. అయితే, ప్రభుత్వం ఎన్ని రూల్స్ పెట్టిన కొందరు అధికారుల తీరు మాత్రం మారడం లేదు. కర్కశ పోలీసులు.. అమాయకులు, రైతులు, పేదలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. తాజాగా నల్గొండ జిల్లాలోని మునుగోడు పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కోటి సింగ్ ఓ రైతుపై వీరంగం సృష్టించాడు. ముత్యాలు అనే రైతును చితక బాదాడు.. మునుగోడు మండల కేంద్రంలో ఇద్దరు రైతుల మధ్య గత కొంత కాలంగా భూ వివాదం కొనసాగుతుంది. ఈ వివాదం నేపథ్యంలో కంప్లైంట్ రావడంతో రైతు ముత్యాలను పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది.అయితే, పొలం పనులు ముగించుకుని వస్తానని రైతు ముత్యాలు ఏఎస్ఐ కోటి సింగ్ ని ప్రాధేయపడ్డాడు. దాంతో



నాకే ఎదురు చెబుతావా అంటూ కోపంతో సదరు రైతుపై కుటుంబ సభ్యుల ముందే చేయి చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ రైతు ముత్యాలు కుటుంబ సభ్యులు ఏఎస్ఐ కోటి సింగ్ పై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అనవసరంగా తనపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఇక, ఏఎస్ఐ తీరుపై పైఅధికారులు తీవ్రంగా మండిపడ్డారు. మరోసారి ఇలాంటి దాడులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం.

## దండుపాళ్యం ముఠాలా ముఖ్యమంత్రి సోదరులు

**ప్రజానావ, ఖైరతాబాద్:**

తెలంగాణ పాలిట దండుపాళ్యం ముఠాలా సీఎం సోదరులు మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రూ. 500 కోట్ల విలువైన పట్టా భూమిని కబ్జా చేశారని, వంద మంది ప్రైవేటు సైన్యంతో స్థలంలో చొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితుడు, మల్కాజ్‌గిరికి చెందిన న్యాయవాది రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై రాచకొండ పోలీస్ కమిషనర్‌ను కలిస్తే.. తమనే బెదిరింపులకు గురిచేశారని దీనిపై సీఎం సోదరులను కలిసి సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ స్పందించారు. న్యాయవాది భూములకే సీఎం సోదరులు ఎసరు పెట్టారంటూ విమర్శించారు. న్యాయం చేయాల్సిన ఖాకీలు సీఎం సోదరులతో సెటిల్ చేసుకోమంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నది పోలీసులా? రేవంత్ ప్రైవేటు సైన్యమా? న్యాయవాదికే న్యాయం దక్కకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్రంలో ఉన్న సోదరులకు తెలంగాణ ఆస్తులను దోచి పెడుతూ.. మరోవైపు అమెరికాలో తమ్ముడి కంపెనీతో రూ. వేయి కోట్ల ఒప్పందంతో ఏం సందేశం ఇస్తున్నట్లు? అని నిలదీశారు.

**కమీషన్ల కోసమే కొడంగల్ ఎత్తిపోతల పథకం...**

శనివారం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కొడంగల్ మండల కాంగ్రెస్ మాజీ ఎంపీపీ దయాకర్ రెడ్డి, బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ నర్మద సహా పలువురు బీఆర్ఎస్ లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు కొడంగల్‌లోనే ఏర్పాటుకు సిద్ధమయ్యాడని మండిపడ్డారు. ఫార్మా కంపెనీ మాకొద్దని స్థానికులు తరిమికొట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. కొడంగల్‌లోనే కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైందని చెప్పారు. రేవంత్ లాంటి దుర్మార్గుడితో తలపడుతూ ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటున్న పట్నం నరేందర్ రెడ్డి సహా మిగతా వారిని నేను అభినందిస్తున్నానన్నారు. పోలీసులతో రేవంత్ రెడ్డి అనేక బెదిరింపులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా ధైర్యంగా పోరాడుతున్న కొడంగల్ వాసుల



పోరాటం స్ఫూర్తి దాయకమన్నారు.

**తెల్ల బంగారం తెల్లబోతున్నది...**

తెలంగాణలో తెల్ల బంగారం తెల్లబోతోందని కేటీఆర్ విమర్శించారు. పత్తి కొనుగోళ్ల తీరుపై ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. దళారుల చేతిలో పత్తి రైతులు చిత్తవుతున్నారని పేర్కొన్నారు. కొర్రీలతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపేసిందని చెప్పారు. రైతు ఆగమవుతుంటే ప్రభుత్వం పత్తా లేదన్నారు. పత్తి కొనుగోళ్ల అంశంలో ప్రభుత్వ చొరవ లేదన్నారు. రైతు డిక్లరేషన్ బోగస్ అని, కాంగ్రెస్ కర్షక ద్రోహి అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైడ్రా @100 డేస్

**ప్రజాభూమి, ఖైరతాబాద్:**

హైడ్రా ఏర్పాటు చేసి వంద రోజులు అవుతుంది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19న జీవో 99 ద్వారా హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ హైడ్రాకు కమిషనర్‌గా ప్రముఖ ఐఏఎస్ ఆఫీసర్ రంగనాథను నియమించిన సంగతి అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అండదండలతో హైదరాబాద్‌లోని అక్రమంగా నిర్మించిన భవనాలు, చెరువులపై కట్టిన పెద్ద పెద్ద బిల్డింగ్స్ తొలగించే లక్ష్యంగా హైడ్రా ఉక్కుపాదం మోపింది. అంతేకాకుండా 100 రోజుల్లో ఈ హైడ్రా దాదాపు 300 పైచిలుకు అక్రమ నిర్మాణాలను తొలగించింది. అంతేకాకుండా చెరువు చుట్టుపక్కల ప్రదేశాలు, నాలాల పక్కన ఉన్న భూములను, కబ్జాకు గురైన నిర్మానుష్య ప్రదేశాలను ఇలా దాదాపు 144 ఎకరాలకు పైగా భూముల్ని పరిరక్షించినట్లు హైడ్ర వెల్లడించింది. అంతేకాకుండా అక్రమంగా కట్టిన పెద్ద పెద్ద బిల్డింగ్స్ ను సైతం తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపింది.

**పెద్ద పెద్ద వివాదాలను సైతం...**

హైడ్రాకు, రేవంత్ సర్కార్‌కు ఎన్నో రకాల విమర్శలు వచ్చాయి. అలాగే పెద్ద పెద్ద వివాదాలను సైతం లెక్కచేయకుండా హైడ్రా తన పని తాను చేసుకుంటూ పోయింది.. అంతేకాకుండా హైడ్రా ప్రారంభంలోనే నాగార్జునాకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ కూడా కూల్చివేసి సంచలనం సృష్టించింది. జులై 26 నుంచి హైడ్రా కూల్చివేతలు మొదలుపెట్టింది. ఇప్పటివరకు 30 ప్రాంతాల్లో 300 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. తాజాగా హైడ్రాకు తెలంగాణ ప్రభుత్వం మరిన్ని అధికారాలను కట్టబెట్టింది. జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) అధికారాలను హైడ్రాకు బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్



సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన తాజా ఉత్తర్వులతో జీహెచ్ఎంసీకి చెందిన రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు మొదలైన పబ్లిక్ ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా హైడ్రా రక్షించనుంది.

## మీ తాత జాగీరా?

**ప్రజానావ, హైదరాబాద్:**

ఇష్టమొచ్చినట్లు పేదల భూములు గుంజుకుంటె చూస్తూ ఊరుకునేది లేదని రేవంత్ సర్కార్ ను ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. దుండిగల్ గ్రామంలో సర్వే నెంబర్ 453, 454 లలో 450 ఎకరాల భూమి ఉండగా.. సుమారు 446 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ఐఐసీకి అప్పగించేందుకు సర్వే నిర్వహించడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో దుండిగల్ వార్డు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ భూముల్లో 40 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నారని, ఇష్టం వచ్చినట్టు భూముల్ని తీసుకోవచ్చని అధికారులు మాట్లాడుతున్నారని, కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇలానే చేసి నాశనం అయ్యిందని గుర్తు చేశారు. అసైన్డ్ భూములను ఇష్టం వచ్చినట్లు లాక్కొనే అధికారం ఎవరికి లేదని, రింగ్ రోడ్డు అప్పుడు కూడా ఇలానే అసైన్మెంట్ భూములను రూపాయి ఇవ్వకుండా గుంజుకుంటుంటే రాజశేఖర్ రెడ్డితో కొట్లాడినమని తెలిపారు. పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు కూడా నష్టపరిహారం ఇచ్చేవరకు వదిలిపెట్టబోమన్నారు. ప్రభుత్వానికి అవసరమైతే అదికూడా ప్రజలకోసం అయితే నష్టప



రిహారం ఇచ్చి తీసుకోవాలని అన్నారు. భూములు గుంజుకుంటె చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూములు అమ్ముకుంటే రెస్యూమ్ చేయండని, కానీ గుంజుకుంట అంటే ఊరుకునేది లేదంటూ అధికారులపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. అసైన్డ్ భూములు ఒక్క సంవత్సరం కోసం ఇవ్వరని, తాత జాగీర్ లాగా ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని హెచ్చరించారు. బాధిత రైతుల తరఫున నేనే కోర్టుకు పోతానని ఈటల స్పష్టం చేశారు.

## 'మెఘా'కు స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ బాధ్యతలు



(మొదటి పేజీ తరువాయి)

అనిల్ కుమార్ యాదవ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో స్కిల్స్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణం చేపడుతామని మెఘా కంపెనీ ప్రకటించింది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన కందుకూరు మండలంలోని మీర్ ఖాన్ పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ నిర్మాణానికి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అక్కడ అధునాతన బోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని వసతులుండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్యాంపస్ నిర్మాణానికి ముందుకు వచ్చిన మెఘా కంపెనీకి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

## ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

**ప్రజానావ, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని జరుగుతున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. మొదట బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు రోడ్లపై నిరసన వ్యక్తం చేయగా శనివారం కానిస్టేబుళ్లు ప్రత్యక్షంగా నిరసనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు బెటాలియన్ లలో యూనిఫామ్ ధరించిన కానిస్టేబుళ్లు నేరుగా ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలో నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబుకు నిరసన సెగ తగిలింది. తమ కోసం తమ కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తే వారి పట్ల అనుచితంగా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఐ గో బ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. సైదాబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లాలోని మామునూరులోనూ 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళన చేపట్టారు. మామునూరు బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. అనంతరం ఇబ్రహీంపట్నం బస్ స్టాప్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి..విగ్రహానికి పూలమాల వేసి ఆందోళన విరమించారు.

**ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు!**

బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనపై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. క్రమశిక్షణతో కూడిన ఫోర్స్‌లో ఉంటూ ఆందోళనలు చేయడం సరికాదన్నారు. సెలవులపై పాత పద్ధతే అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనలకు దిగడం సరికాదన్నారు. ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉన్నాయనే అనుమానం ఉందన్నారు. ఆందోళనలు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మన దగ్గర ఉన్న రిక్రూట్‌మెంట్ వ్యవస్థను అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని ప్రకటనలో పేర్కొన్నారు.

## కాలానికి అనుగుణంగా కుల వృత్తులు మారాలి

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

గంగపుత్రులు ఆర్థికంగా ఎదగడానికి కుల వృత్తి ఎంతో దోహదపడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరితో కలిసి పూజలు చేసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలకు మరింత న్యాయం చేయాలని, ఆర్థికంగా ఎదగాలని చేప పిల్లల పంపిణీ గతానికి మించి చేస్తున్నామని అన్నారు. గతంలో చేప పిల్లల పంపిణీ చేయడానికి పాత పేమెంట్ కొంత ఇబ్బంది పడ్డారు.. అవి క్లియర్ చేసి 100 శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలు ఇవ్వడం జరుగుతుందన్నారు.సిద్దిపేట జిల్లాలో మత్స్య సహకార సంఘాలు ఉన్నవాటికి పరిమితం కాకుండా నీటి నిల్వలు ఉన్న దగ్గర కూడా చేప పిల్లలు వేయాలని కలెక్టర్ ను కోరారు. "హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతి చెరువులో చేప పిల్లలు వెయ్యాలని వేసుకునే బాధ్యత మీదే..మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి కుల వృత్తులు మారాలి..మత్స్య శాఖ కు సంబంధించి మొబైల్ మార్కెట్ లు అమ్ముకోవడానికి మౌలిక వసతులు తదితర వాటిపై చర్యలు తీసుకుంటాం. శనిగరం దగ్గర ప్రభుత్వ స్థలంలో ఫిష్ మార్కెట్ పెడతాం.." ఆర్డీవో స్థల సేకరణ చేయాలని అన్నారు. " హైదరాబాద్ కి పోయే వారు ఇక్కడ చేపలు కొనుక్కొని పోయేలా అభివృద్ధి జరగాలి. శనిగరం గెస్ట్ హౌజ్ పునరుద్ధరణ చేస్తాం.. ఇక్కడ టూరిజం అభివృద్ధి చేస్తాం..ఫిష్ పాండ్ ను పునరుద్ధరణ చేయాలి. దానిని ఆక్టివ్ చేయాలి. మత్స్య సంపద,పశు పోషణ పాలు,కోళ్ళు పై ఎక్కువ దృష్టి సారించాలి.ఆయిల్ ఫాం, డ్రాగన్ ఫ్రూట్, చేపల చెరువు ,కోళ్ళు పెంపకం, ఆవులు గేదెల పెంపకం పై రైతు వేదికల వద్ద అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంకర్ల తో కూడా మీటింగ్ లు పెట్టి లోన్లకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం" అని అన్నారు.

## మేడారం మహా జాతర తేదీలు ఖరారు

**ప్రజానావ, వరంగల్ బ్యూరో:**

దక్షిణభారత కుంభమేళాగా ఖ్యాతిగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మల మినీ జాతర తేదీలు ఖరారయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజులపాటు ఈ మినీ జాతర జరగనుంది. రెండేళ్లకోసారి మేడారం మహా జాతర జరుగుతుండగా.. అధిక సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. వనంలో కొలువైన వనదేవతలు జనం మధ్యకు రావడంతో అడవి అంతా జనసంద్రమవుతుంది. మహా జాతర జరిగిన మరుసటి సంవత్సరం చిన్న జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం సమావేశమైన పూజారులు.. మినీ జాతర తేదీలను ప్రకటించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# తీరుమారని బ్యాటర్లు

## రెండో టెస్టులోనూ భారత్ చిత్తు 2-0తో సిరీస్ న్యూజిలాండ్ వశం



పుణె: సొంత గడ్డపై టీమిండియాకు ఘోర పరాభవం ఎదురైంది. న్యూజిలాండ్‌తో పుణె వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్ 113 పరుగుల తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. కివీస్ చారిత్రక విజయంతో భారత గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పటికే బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో జయకేతనం ఎగుర వేసిన న్యూజిలాండ్ తాజాగా పుణెలోనూ జయభేరి మోగించి 20తో సిరీస్‌ను దక్కించుకుంది. అంతేగాక ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో విదేశీ గడ్డపై సిరీస్‌ను గెలుచుకోవడం కివీస్‌కు ఇదే తొలిసారి కావడం మరో విశేషం. ఇక 359 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 254 పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్ వైఫల్యం భారత్‌ను మరోసారి దెబ్బతీసింది. యశస్వి జైస్వాల్ తప్ప మిగతా వారు విఫలం కావడంతో భారత్‌కు అవమానకర రీతిలో ఓటమి తప్పలేదు. అంతకు ముందు 198/5 స్కోరుతో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంలో టీమిండియా బౌలర్లు సఫలమయ్యారు. వికెట్ కీపర్ టామ్ బ్లండెల్, గ్లెన్ ఫిలిప్స్‌లు సమన్వయంతో ఆడుతూ స్కోరును ముందుకు నడిపించారు. దాదాపు ఆరు ఓవర్ల పాటు ఇద్దరు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే 83 బంతుల్లో 3 ఫోర్లతో 41 పరుగులు చేసిన బ్లండెల్‌ను రవీంద్ర జడేజా అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత భారత్ వరుస క్రమంలో వికెట్లను పడగొట్టింది. సాంట్నర్ (4)ను కూడా జడేజా వెనక్కి పంపాడు. ఇక టీమ్ సౌథీ (0) అశ్విన్ ఔట్ చేశాడు. ఎజాజ్ పటేల్ (1)ను జడేజా వెనక్కి పంపాడు. ఓ రౌర్కీ (0) రనౌటయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ 4 ఫోర్లు, రెండు సిక్సర్లతో 48 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కాగా, కివీస్ రెండో ఇన్నింగ్స్ 69.4 ఓవర్లలో 255 పరుగుల వద్ద ముగిసింది. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ నాలుగు, జడేజా మూడు, అశ్విన్ రెండు వికెట్లు పడగొట్టారు.

**రోహిత్ మళ్లీ విఫలం..**

ఇక 359 లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్ ఆరంభంలో బాగానే ఆడింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ దూకుడైన బ్యాటింగ్‌తో స్కోరును పరిగెత్తించాడు. అయితే జట్టు స్కోరు 34 పరుగుల వద్ద కెప్టెన్ రోహిత్ శర్మ ఔటయ్యాడు. ఈసారి కూడా రోహిత్ నిరాశ పరిచాడు. కేవలం 8 పరుగులు మాత్రమే చేసి సాంట్నర్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. రోహిత్ మొదటి ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన సంగతి తెలిసిందే.

**యశస్వి దూకుడు..**

అయితే వన్‌డౌన్‌లో వచ్చిన శుభ్‌మన్ గిల్‌తో కలిసి యశస్వి పోరాటం కొనసాగించాడు. ఇద్దరు జాగ్రత్తగా ఆడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. ఇదే క్రమంలో గిల్, జైస్వాల్ రెండో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. కానీ 31 బంతుల్లో 4 ఫోర్లతో 23 పరుగులు చేసిన గిల్‌ను సాంట్నర్ ఔట్ చేశాడు. కొద్ది సేపటికే యశస్వి కూడా పెవిలియన్ చేరాడు. దూకుడుగా ఆడిన యశస్వి 65 బంతుల్లోనే 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేశాడు. ఇక ఈ మూడు వికెట్లు కూడా సాంట్నర్‌కే దక్కడం విశేషం. తర్వాత వచ్చిన వికెట్ కీపర్ రిషబ్ పంత్ లేని పరుగు కోసం వెళ్లి రనౌటయ్యాడు. రిషబ్ ఖాతా కూడా తెరవలేక పోయాడు.

**తీరుమారని కోహ్లి..**

మరోవైపు జట్టును ఆదుకుంటాడని భావించిన సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి మళ్లీ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో కోహ్లి ఒక పరుగు మాత్రమే చేసి క్లీన్‌బౌల్డ్ అయిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. 40 బంతుల్లో 2 ఫోర్లతో 17 పరుగులు చేసి సాంట్నర్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. యువ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ కూడా నిరాశ పరిచాడు. సర్ఫరాజ్ 9 పరుగులు మాత్రమే చేసి సాంట్నర్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. వాషింగ్టన్ సుందర్ 2 ఫోర్లతో 21 పరుగులు సాధించాడు. ఇక రవీంద్ర జడేజా 2 ఫోర్లతో 42 పరుగులు చేశాడు. అశ్విన్ (18), బుమ్రా 10(నాటౌట్) పరుగులు సాధించారు. కాగా, భారత్ రెండో ఇన్నింగ్స్ 60.2 ఓవర్లలో 245 పరుగులకు పరిమితమైంది. కివీస్ బౌలర్లలో సాంట్నర్ ఆరు, ఎజాజ్ పటేల్ రెండు వికెట్లు తీశారు. ఇదిలావుంటే ఈ మ్యాచ్‌లో కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేయగా, భారత్ 156 పరుగులకు ఆలౌటైంది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 13 వికెట్లు తీసి కివీస్‌ను గెలిపించిన సాంట్నర్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

**స్పిన్ ఉచ్చులో భారత్..**

తొలి మ్యాచ్‌లో ఫాస్ట్ పిచ్‌ను తయారు చేసి ఓటమి కొని తెచ్చుకున్న ఆతిథ్య టీమిండియా రెండో టెస్టు కోసం తనకు కలిసి వచ్చే స్పిన్ పిచ్‌ను సిద్ధం చేసుకుంది. అయితే భారత్ అనూహ్యంగా తాను పన్నిన ఉచ్చులోనే చిక్కుకుని ఘోర పరాజయం చవిచూసింది. భారత్ కంటే కివీస్ స్పిన్‌ను తనకు అనుకూలంగా మార్చుకుందని చెప్పాలి. మిఛెల్ సాంట్నర్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ అసాధారణ బౌలింగ్‌తో చెలరేగాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా ఏడు వికెట్లను పడగొట్టాడు. పార్ట్‌టైమ్ స్పిన్నర్ గ్లెన్ ఫిలిప్స్ మొదటి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో భారత్‌కు చెందిన 19 వికెట్లను స్పిన్నర్లే పడగొట్టడం విశేషం. దీన్ని బట్టి కివీస్ స్పిన్నర్లు పిచ్‌ను ఎంత అనుకూలంగా మార్చుకున్నారో ఊహించుకోవచ్చు. భారత్ తరఫున వాషింగ్టన్ సుందర్ పిచ్‌ను చక్కగా ఉపయోగించుకున్నాడు. సుందర్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 11 వికెట్లను పడగొట్టాడు. మిగిలిన 9 వికెట్లను అశ్విన్, జడేజా తమ ఖాతాలో వేసుకున్నారు.




# పాకిస్థాన్‌దే సిరీస్

రావల్పిండ్: ఇంగ్లండ్‌తో జరిగిన మూడో, చివరి టెస్టులో పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను పాకిస్థాన్ 21తో సొంతం చేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత పాకిస్థాన్ టెస్టు సిరీస్‌ను గెలుచుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన పాకిస్థాన్ ఆ తర్వాత వరుసగా రెండు టెస్టుల్లో గెలిచి పెను ప్రకంపనలు సృష్టించింది. పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగి వరుసగా రెండు టెస్టుల్లో గెలవడం విశేషం. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే కుప్పకూలింది. నౌమన్ అలీ, సాజిద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. నౌమన్‌కు ఆదరు, సాజిద్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఇక 37 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.

# యశస్వి అరుదైన ఘనత



పుణె: టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భారత టెస్టు చరిత్రలో అత్యంత అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో 30 కంటే ఎక్కువ సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా యశస్వి చరిత్ర సృష్టించాడు. కివీస్‌తో జరిగిన రెండో టెస్టులో యశస్వి ఓ క్యాలెండర్ ఇయర్‌లో 32 సిక్సర్ల రికార్డును అందుకున్నాడు. ప్రపంచ టెస్టు చరిత్రలో ఇప్పటి వరకు కేవలం బ్రెండన్ మెక్‌కల్లమ్ మాత్రమే యశస్వి కంటే ముందంజలో ఉన్నాడు. మెక్‌కల్లమ్ 2014లో 33 సిక్సర్లు బాదాడు. యశస్వి ఇప్పటికే 32 సిక్సర్లు కొట్టాడు. ఇక ఈ సీజన్‌లో మరో ఆరు టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. దీంతో మెక్‌కల్లమ్ రికార్డును బద్దలు కొట్టడం లాంఛనమే. దీంతో పాటు మరో అరుదైన రికార్డును కూడా యశస్వి నమోదు చేశాడు. భారత్ తరఫున అత్యంత వేగంగా 1000 పరుగుల మైలు రాయిని అందుకున్న యువ బ్యాటర్‌గా యశస్వి నిలిచాడు. అంతేగాక ఓ క్యాలెండర్ ఇయర్‌లో సొంత గడ్డపై వెయ్యి పరుగులు సాధించిన మూడో బ్యాటర్‌గా యశస్వి రికార్డు సృష్టించాడు.



## రూ.5 కే భోజనం..ముక్కు మూసుకుంటేనే తినగలం!

ప్రజానావ, వరంగల్:

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని అన్నపూర్ణ భోజన పథకం పంపిణీ కేంద్రాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప డబ్బాలు పాడయ్యాయి. రూ.5 భోజనం పంపిణీ కేంద్రాలపై వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారుల పర్యవేక్షణ కరవైంది. వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణ పేరుతో భోజనం కేంద్రాన్ని.. బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి మార్చారు. భోజనం అందించే డబ్బా చుట్టూ మురుగు నిలిచి.. దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిలవడంతో దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. ఛీ.. ఛీ.. ఇదేం కంపు అంటూ ప్రజలు ఈసడించుకుంటున్నారు. దీనివల్ల చాలామంది కేంద్రాల వద్దకు రావడం లేదు. వచ్చినవారు వరంగల్ అండర్ బ్రిడ్జి కేంద్రం వద్ద రోడ్డు మీద, సమీపంలో ఉన్న దుకాణాల ముందు నిలబడి భోజనం చేస్తున్నారు. అనంతరం విస్తరాకులు, ఇతర వ్యర్థాలు ఆరుబయట విచ్చలవిడిగా పడేస్తున్నారు.

**రోజూ 3500 మందికి పైగా..**

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో 13 అన్నపూర్ణ రూ.5 భోజనం కేంద్రాలు కొనసాగుతున్నాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లోని ప్రధాన కూడళ్లలో వాటిని ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ, యువకుల కోసం హనుమకొండ జిల్లా గ్రంథాలయం, వరంగల్ రంగంపేట ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం, వరంగల్ ఎల్లమ్మబజారు జిల్లా గ్రంథాలయం వద్ద అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజూ 3500 మందికి పైగా భోజనాలు చేస్తున్నారు. రూ.5 భోజన పథకం కోసం గ్రేటర్ వరంగల్ సాధారణ నిధుల (జనరల్‌ఫండ్స్) ద్వారా నెలకు సుమారు రూ.2528 లక్షలు చెల్లిస్తున్నారు. మూడు నెలలకోసారి బిల్లులు ఇస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చవుతున్నా.. ప్రజారోగ్య విభాగం అధికారులు తనిఖీలు చేయడం లేదు.

# పరిశ్రమల అనుమతులు సకాలంలో పూర్తి చేయాలి

## డీపీపీసీ- టీఎస్ ఐ పాస్, టీ ప్రైడ్ పై సమీక్ష సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



ప్రజానావ, సిరిసిల్ల:

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో శనివారం డీపీపీసీ టీఎస్ ఐ పాస్, టీ ప్రైడ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అనుమతి కోసం ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి?. ఏ ఏ కారణాలతో నిలిచిపోయాయో ఆయా శాఖల ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. డీపీపీసీ టీఎస్ ఐ పాస్ కింద పీసీబీ 2, సెస్, ఫ్యాక్టరీస్, నీటి పారుదల శాఖ వద్ద ఒక్కో అప్లికేషన్ పెండింగ్ లో ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తీసుకెళ్లారు.

**టీ ప్రైడ్ కింద..**

టీ ప్రైడ్ కింద ఎస్సీ లకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద 2 యూనిట్స్ మంజూరయ్యాయని జీఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తెలిపారు. ఈ సమావేశంలో ఇండస్ట్రీస్ ఏడీ భారతి, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం మల్లికార్జున్, జిల్లా ఇరిగేషన్ అధికారి అమరేందర్ రెడ్డి, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీటీసీపీఓ అన్సార్, లేబర్ ఆఫీసర్ నజీర్ అహ్మద్, డీటీడీఓ జనార్ధన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


# పారదర్శకంగా టీచర్ల సర్దుబాటు



ప్రజానావ, సిరిసిల్ల:

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 111, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 39, ప్రాథమిక పాఠశాలలు 330 ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 252 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు శనివారం కౌన్సిలింగ్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సర్దుబాటు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల వివరాలు పరిశీలిస్తూ.. ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడారు. ఆయా పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలలో విజయం సాధించేలా శిక్షణ ఇవ్వాలని ఆకాంక్షించారు. వృత్తి నిబద్ధత పాటిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈఓ రమేష్ కుమార్, ఎంఈఓలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి మూడిళ్లలో చోరీలు



ప్రజానావ, కరీంనగర్:

కరీంనగర్ పట్టణంలో గురువారం అర్ధరాత్రి మూడిళ్లలో చోరీలు జరగడం కలకలం రేపింది. ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే జిల్లా ప్రజలు భయపడుతున్నారు. కరీంనగర్ ఒకటో, రెండో ఠాణా సీఐలు విజయ్‌కుమార్, కోటేశ్వర్‌లు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా.

1. టెలిఫోన్‌క్వార్టర్స్ రోడ్డు నంబర్ 1లో నివాసముండే జోగినిపెల్లి రఘునందన్‌రావు తన భార్యతో కలిసి వారం రోజుల కిందట అమెరికాలోని కుమార్తె వద్దకు వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని చూసిన పక్కింటి వారు ఆయనకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. రఘునందన్‌రావు సోదరి అక్కడికి వచ్చి ఇంటిని పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి ఓ యువకుడు ముఖానికి మాస్క్ వేసుకొని చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. నిందితుడు తనను గుర్తించకుండా మొదట సీసీ కెమెరాలను పక్కకు నెట్టాడు. ఇంటికి ఉన్న సెంట్రల్ లాకింగ్ సిస్టంను పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. రెండో ఠాణా పోలీసులు, ఫింగర్ ప్రింట్ నిపుణులు వచ్చిన ఘటనాస్థలిని పరిశీలించారు. ఆధారాలు సేకరించారు. మూడు తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు, విలువైన చేతిగడియారం, ట్యాబ్‌లు అపహరణకు గురైనట్లు రఘునందన్‌రావు కుటుంబసభ్యులు రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు.

2. రాంనగర్ రోడ్డు నంబర్ 8లో నివాసముండే స్టాంప్ వెండర్ కూర కిషన్ గురువారం రాత్రి నగరంలో ఉండే కుమార్తె ఇంటి వద్ద ఉండి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లో ఉన్న రూ.20 వేల విలువగల స్టాంప్ పేపర్స్, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

3. వినాయకనగర్ రోడ్డు నంబర్ 4లో నివాసముండే కాట రమేష్ అనే వ్యాపారి, అతని సోదరుడు మృతి చెందటంతో గురువారం మానకొండూర్ మండలం కెల్లెడకు వెళ్లి శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ ఘటనాస్థలిని పరిశీలించారు. ఇంట్లో బీరువాలో ఉంచిన 4.5 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి చోరీకి గురయ్యాయని బాధితుడు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు మొదలుపెట్టామని ఇద్దరు సీఐలు తెలిపారు.

## 11 ఏళ్ల తర్వాత 19వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు : మంత్రి పొన్నం




ప్రజానావ, కరీంనగర్:

తెలంగాణలోని మోడల్ పాఠశాలల్లో 11 ఏళ్ల తర్వాత 19 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 35 వేల మందికి బదిలీలు చేపట్టామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్‌లో కలెక్టర్ పమేల సత్పతితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థుల రోల్ ప్లేను అధికారులతో కలిసి మంత్రి పొన్నం వీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లాలో 23,000 మంది విద్యార్థులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద షూస్ పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 25వేల పాఠశాలల్లో రూ.11 వేల కోట్లతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. శానిటైజేషన్ సిబ్బంది కోసం నిధులు, ఉచిత విద్యుత్, తాగునీటితోపాటు అన్ని గురుకులాలకు అద్దెలు చెల్లించామన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 14 భాషల్లో మాట్లాడేవారని గుర్తు చేశారు. విద్యార్థులు కూడా ఇంగ్లీష్, హిందీ ఇతర భాషలు నేర్చుకొని, కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్స్ ఏర్పాటు
- వనదుర్గ ఆలయం టూరిజం అభివృద్ధి
- చర్చి వంద సంవత్సరాల సెలబ్రేషన్స్ నిర్వహణ
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజానావ, మెదక్:**

మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి శాఖల వారీగా మౌలిక వసతుల కల్పనపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో మెదక్ నియోజకవర్గ అభివృద్ధి పర్చేందుకు శాఖల వారీగా ప్రతిపాదనలు తయారు చేయడంపై ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, దేవాదాయ, వైద్య, మున్సిపాలిటీ, టూరిజం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ప్రధమ స్థానంలో నిలపాలని మెదక్ ఎమ్మెల్యే అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. జిల్లా అభివృద్ధిపై శాఖల వారీగా ప్రతిపాదనలు తయారు చేసి అందించిన పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సూచించారన్నారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై నియోజకవర్గ అభివృద్ధిపై ప్రతిపాదన సిద్ధం చేసే దిశగా చర్చిస్తున్నట్లు తెలిపారు. మెదక్ ఎంట్రన్స్‌లో వెల్కమ్ బోర్డు సరికొత్త ఆలోచనలతో మెదక్ అంటే మెతుకు సీమ బియ్యం గింజ బ్యాక్ గ్రౌండ్ వచ్చే విధంగా చూపరులను ఆకట్టుకునే విధంగా తయారు చేయించాలన్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఈ సెంటర్‌లో కుక్కల, కోతుల జంతు జనన నియంత్రణ చర్యలు చేపట్టడం, వైద్య కళాశాల ప్రాంగణంలో హాస్పిటల్, స్టాఫ్ క్వార్టర్స్ సిబ్బంది వసతి గృహాలు, ఎస్టిమేట్స్ సిద్ధం చేయడం, టూరిజం అభివృద్ధి ఏడుపాయల వన దుర్గ దేవాలయానికి సంబంధించి రోడ్డు వైడింగ్, హోటల్ కం టూరిజం గెస్ట్ హౌస్, మెయిన్ రోడ్ నుంచి టెంపుల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, మెదక్ చర్చి, సంబంధించి వచ్చే డిసెంబర్ నాటికి చర్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని సెలబ్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందని చర్చి పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ పరంగా మెదక్ చర్చి ప్రాంగణంలో సభ్యులతో సమన్వయంతో అభివృద్ధికి ఎస్టిమేట్స్ తయారు చేయాలన్నారు. మెదక్ బస్టాండ్ మోడ్రనైజేషన్, సరికొత్త ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్, మున్సిపాలిటీ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, ఇరిగేషన్ చెరువులు మినీ ట్యాంక్ బండ్స్, మెదక్ పోర్ట్ అభివృద్ధి, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బీ బ్రిడ్జెస్, యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసే దిశగా నివేదిక తయారు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనతో జిల్లా అభివృద్ధి ఇతర జిల్లాలతో పోటీ తత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, దేవాదాయ, వైద్య, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజానావ, దౌల్తాబాద్ :**

పేదరికంతో కొట్టుమిట్టాడుతూ తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స తీసుకోవడానికి కూడా డబ్బులు లేకుండా మృతి చెందిన ఆటో డ్రైవర్ మంగలి యాదగిరి కుటుంబానికి శనివారం నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు మంగలి స్వామి బియ్యం అందజేసి మానవత్వం చాటుకున్నారు. దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్ మంగలి యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ యాదగిరి ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడని, ఆటో నడిపితే ఉపాధి లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టమయ్యింది. అనారోగ్యానికి గురైతే కూడా చికిత్స తీసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో మృతి చెందడం చాలా బాధాకరం. యాదగిరి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి,వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమం నర్సింహులు, కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం




**ప్రజానావ, తూప్రాన్:**

న్యాయపరమైన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తూప్రాన్ సీఐ రంగా కృష్ణ అన్నారు. శనివారం పోలీసు అమరవీరుల దినోత్సవ వేడుకల్లో భాగంగా తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులుకు దేశంలో అమలవుతున్న కొత్త చట్టాలు, పోలీసుల విధులు, తుపాకుల పనితీరు, అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుతోపాటు మంచి అలవాట్లను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివానందం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ



**ప్రజానావ, రామాయంపేట :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం దంతేపల్లి గ్రామంలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మదనపల్లి రోహిత్‌రావు పర్యటించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా పాలించినా, అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే అభివృద్ధి వేగవంతంగా కొనసాగుతుందన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు నిర్వహించామన్నారు. రాబోవు రోజుల్లో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాత్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచందర్‌గౌడ్, రమేశ్‌రెడ్డి, నాగులు, కుమార్‌సాగర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గంగారాం, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు జయరాం, బీసీ సంఘం రామాయంపేట మండల అధ్యక్షులు రాజేశం, బీసీ సంఘం మెదక్ జిల్లా క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు గణేష్, గ్రామ రజక సంఘం అధ్యక్షులు సిద్ధయ్య, ఉపాధ్యక్షులు సంతోష్, మండల కోశాధికారి శంకర్, రజక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి చిన్న, నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధిరాములు, గ్రామస్తులు రాములు, కిషన్, దుర్గయ్య, శంకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి

**ప్రజానావ, రామాయంపేట :**

రామాయంపేట మండలంలోని తొనిగండ్ల, లక్ష్మాపూర్, కాట్రియాల, రామాయంపేట మున్సిపాలిటీ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ధర్నాలు రాస్తారోకోలు చేస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బంది కలగకుండా కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 470కి పైగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. రైతుల పండించిన సన్నధాన్యంకు దేశంలో ఎక్కడా లేనివిధంగా 500 రూపాయల బోనస్ ప్రకటించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తామని, తూకం వేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చౌదరి సుప్రభాత్‌రావు, కాంగ్రెస్ నాయకులు రమేశ్‌రెడ్డి, కుమార్‌సాగర్, ఏనిశెట్టి అశోక్, శివప్రసాద్‌రావు, అల్లాడి వెంకటి, బైరం కుమార్, రాజా మాజీ ఎంపీటీసీ నాగులు, యాదగిరి, కమ్మరి రమేష్, బిల్లం మహేందర్‌రెడ్డి, దుర్గానాయక్, తాజా మాజీ ఉపసర్పంచ్ హనుమంతరావు, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి రవాణ చేస్తే కఠిన చర్యలు



**ప్రజానావ, మనోహరాబాద్ :**

మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామ శివారులో మట్టి తవ్వకాలు చేస్తూ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ రంగా కృష్ణ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మట్టిని తవ్వుతూ రవాణా చేసి విక్రయిస్తున్నారని టీజీఐఐసీ అధికారులు చేసిన ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు అక్రమ మట్టి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. వాహనాలను పట్టుకున్న మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, ఏఎస్ఐ మూర్తి. చంద్రమోహన్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

## బాధిత కుటుంబానికి చేయూత



**ప్రజానావ, రామాయంపేట :**

మెదక్ జిల్లా రామయంపేట మున్సిపాలిటీ పరిధిలోని గోలిపర్తి గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు లింగోల సత్యం కుటుంబాన్ని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గజవాడ నాగరాజు పరామర్శించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సత్యం కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల ఆర్థికసాయం, నిత్యవసర సరుకులను అందజేశారు. ప్రజా సమస్యల పోరాటాలకు సత్యం చేసిన సేవలను ఆయన కొనియాడారు.

## ఎస్సీ వర్గీకరణకు సీఎం సహకరించాలి



**ప్రజానావ, గజ్వేల్ :**

ఎస్సీ వర్గీకరణకు సహకరించి సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలని ఎంఎస్‌పీ సీనియర్ నేత లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు, సీనియర్ నాయకులు యాదగిరి, రాములు డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును అనుసరించాలని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన విధంగా దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలులో రాష్ట్రాన్ని ముందు ఉంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి అయ్యేంతవరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని వారు కోరారు. మాలల ఒత్తిడికి తలగి మాదిగలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్రోహం చేస్తున్నాడన్నారు. ఈనెల 28న సిద్దిపేటలో మాదిగల ధర్మ యుద్ధ సదస్సును నిర్వహిస్తున్నామని ముఖ్యతిథిగా మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి సింధు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు రవీందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

## బీజేపీ సభ్యత్వం నమోదుకు విశేష స్పందన

**ప్రజానావ, గన్నేరువరం:**

స్పెషల్ డ్రైవ్ బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం శనివారం జంగపల్లి గ్రామంలో నాయకులు చేపట్టారు . ఈసందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచన మేరకు ప్రతి బూతులో 3 సభ్యత్వాలు తగ్గకుండా ఉండాలని సూచించడంతో ప్రతి గ్రామంలో ముఖ్య నాయకులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి సభ్యత్వం కార్యక్రమాన్ని చేపట్టామని, జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని ప్రతి ఒక్క కార్యకర్త మెంబర్షిప్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి బూతులో 200 నుండి 300 కు తగ్గకుండా బూతు అధ్యక్షులు పనిచేస్తున్నారని, నాయకులు తెలిపారు .ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ,సుదర్శన్ రెడ్డి ,రామచంద్రం ,కొంకటి గణేష్ ,బోయిని హరీష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో యువకుడి మృతి

**ప్రజానావ, వేములవాడ రూరల్ :**

అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన ఘటన వేములవాడ రూరల్ మండలం పరిధిలోని చెక్కపల్లి లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే అడెపు ఆడ్డిక శ్రీనివాస్ (39) అనే వ్యక్తి రక్త కణాలు తగ్గి మృతి చెందాడు ఇతనికి భార్య పేద కుటుంబం కావడంతో సరైన వైద్యం అందక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు గత 15 రోజులుగా విపరీతమైన జ్వరం రావడంతో కరీంనగర్ లోని ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లి రక్తకణాలు కొంత వరకు పెరగడంతో మళ్లీ ఇంటికి తీసుకువచ్చారు హాస్పిటల్ ఖర్చులు ఎక్కువ కావడం వల్ల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా తగ్గకముందే ఇంటికి తీసుకురావడం వల్ల రక్త కణాలు పూర్తిగా తక్కువ కాగానే మళ్లీ కరీంనగర్లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు ఆరోగ్యం పూర్తిగా విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు



## కంటి చూపు కోల్పోయిన మహిళకు శ్రీమిత్ర సేవా సమితి ఆర్థిక సహాయం

**ప్రజానావ, కాగజ్ నగర్:**

కాగజనగర్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన చునార్కర్ పల్లవి అనే మహిళకు పూర్తి స్థాయిలో కంటి చూపును కోల్పోవడంతో విషయం తెలుసుకున్న శ్రీ మిత్ర సేవా సమితి సభ్యులు బాధిత మహిళ పల్లవికి రూ. 13,800 శ్రీమిత్రా సేవా సమితి ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు సుంకరి తిరుపతి ,వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి మంజుల,కోశాధికారి బాలకృష్ణ,అడ్వకేట్ కిషోర్ బాబు,ఎస్, పి, ఏం,క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజానావ, రాంగోపాల్ పేట్:**



రామ్ గోపాల్ పేట్ డివిజన్ లోని కలాసిగూడ జిహెచ్ యంసి కమ్యూనిటి హాలులో శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఫౌండేషన్ రిసెర్చ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్, మక్తాల ఫౌండేషన్, శివ శక్తీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజి, పెడియాట్రిక్స్ విభాగాల వైద్యులు 202 మందికి బీపీ, షుగర్ లను పరీక్షించి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని మందులను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా 90 మంది మహిళలకు హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి మాత్రలను అందజేశారు. శ్రీ భాస్కరా ఐ అండ్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో నేత్ర, దంత పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ ఫిజియోథెరపిస్టు M శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోకాలు, నడుము నొప్పి ఉన్నవారికి ఎక్సర్సైజ్ లను చూపించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్ గౌడ్ నిర్వాహకులను అభినందించారు. పేద ప్రజలు ఉండే బస్తీల్లో ఉచిత వైద్య సేవలు ఎంతో అవసరమని ఆమె అన్నారు. అనంతరం మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జలందర్ గౌడ్ మట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని అన్నారు చిన్న ఆరోగ్య సమస్య ఉన్నప్పుడే వైద్యులను సంప్రదించడం ద్వారా చికిత్సపోందవచ్చునని సూచించారు.ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహమూర్తి, నంద కుమార్, శివశక్తి ఫౌండేషన్ ప్రతినిధి కల్యాణ్ కుమార్, మాజీ కార్పోరేటర్ అత్తల్లి మల్లిఖార్జున్ గౌడ్, బి.ఆర్.ఎస్. రాంగోపాల్ పేట్ డివిజన్ జనరల్ సెక్రటరీ వి.అంజనేయులు, విజయ్, మక్తాల ఫౌండేషన్ సభ్యులు సుబ్రమణ్యం, వేంకటచారి, యం. శ్రవణ్, యం.యల్. హరికుమార్, కె. వెంకటేష్, కె. వేణు, శివకుమార్ మరియు మెడికల్ క్యాంపు కో ఆర్డినేటర్ బి. నర్సింగ్ రావు పాల్గోన్నారు.

# 28న సిద్దిపేటకు మందకృష్ణ మాదిగ రాక

**ధర్మ యుద్ధ సన్నాహక సభ ను విజయవంతం చేయండి**

**ప్రజానావ, బెజ్జంకి:**



త్వరలో ఏర్పాటు చేయనున్న ధర్మ యుద్ధ సభ కోసం ఈనెల 28న సిద్దిపేటలో జరిగే ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాక సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరై, దిశ నిర్దేశం చేస్తారని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు పెర్క పర్శరములు మాదిగ తెలిపారు.ఈ మేరకు బెజ్జంకి మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఉమ్మడి ఉమ్మడి మెదక్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ సన్నాక సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలను భర్తీలను చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధపడుతున్నందుకు నిరసనగా ధర్మ యుద్ధ మహాసభ చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతకింది పర్శరాములు మాదిగ,ఎమ్మెస్పి మండల ఇంచార్జి మాతంగి జితేందర్ మాదిగ,జిల్లా నాయకులు మాదాసు బాబు మాదిగ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జనగాం శంకర్ మాదిగ, సీనియర్ నాయకులు వద్లూరి పర్శరాములు,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బోనగిరి శ్రీనివాస్ మాదిగ,పట్టణ అధ్యక్షులు లింగాల బాబు మాదిగ,అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు తాడిచేట్టు భూమయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొంపెల్లి రాజు మాదిగ, వివిధ గ్రామాల మాదిగ సర్పంచులు కర్రావుల మల్లేశం,కొంకటి జగన్,మంకాల బాలయ్య,అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు బోనగిరి ఆనంద్, రాజు,లింగం,శ్రీనివాస్,శ్రీకాంత్ పాల్గొన్నారు

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజానావ, తిమ్మాపూర్:**

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎమ్ ఎల్ ఏ క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్ ఎల్ ఏ డా.కవ్వంపెల్లి సత్యనారాయణ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మా ప్రభుత్వం ఎల్లపుడూ అండగా ఉంటుంది దూర ప్రాంతాలకు ప్రయివేట్ వైద్య నిమిత్తం వెళ్లేవారికి భరోసా ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలకు ఆసరాగా వైద్యనిమిత్తం ప్రాణ పాయ స్థితిలో ఉంటే సీ ఎం సహాయ నిది నుండి తక్షణం 10 లక్షల రూపాయల వరకు ఎల్ ఓ సి ఇప్పించి ప్రాణాలు కాపాడడానికి సహకరిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరిపెల్లి రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.రమేష్, ఎం ఎ.సమద్,కొండలరావు ,కుంట రాజేందర్ రెడ్డి,శ్రీనివాస్ రావు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయానికి విరాళం అందజేత



**ప్రజానావ, వేములవాడ:**

రేణుక ఎల్లమ్మ తల్లి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రుద్రవరం గ్రామ మాజీ ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం కోడుముంజ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయానికి తన జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం 15,116 రూపాయలను విరాళం ఆలయ నిర్వహకులకు అందించారు. అమ్మవారి దయ దాక్షిణ్యాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

## అతి తక్కువ కాలంలో ప్రజా వ్యతిరేకత మూట కట్టుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజానావ, బెజ్జంకి:**

ఇచ్చిన 420 హామీలు అమలు చేయకుండా,విదేశీ టూర్ ల పేరుతో ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం వృథా చేస్తున్నాదని బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు బండి పెల్లి సతీష్ తెలిపారు.రబీ సీజన్ మొదలు అయినా కూడా ఇప్పటివరకు రైతు భరోసా ఊసే ఎత్తడం లేదని,రైతుల పైన కాంగ్రెస్స్ ప్రభుత్వం యొక్క కపట ప్రేమ కనిపిస్తుందని,ఎన్నికల ప్రచారంలో మరియు మేనిఫెస్టో లో అన్నీ పంటలకు బోనస్ ఇస్తాము అని తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు మాత్రం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తాం అనీ కాబినెట్ నిర్ణయించడం సబబు కాదని,ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారు అని సతీష్ తెలిపారు.



## జాతీయ బీసీ యువజన అర్బన్ మండల కమిటీ నియామకం

**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ అర్బన్ మండల జాతీయ బిసి యువజన కమిటీని నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా కోరే వెంకటసాయి, ఉపాధ్యక్షుడిగా మ్యాకల మనోహర్, ప్రధాన కార్యదర్శిగా కలుకూరి జలన్, కార్యదర్శిగా పల్లెమిట్ట శేఖర్, కోశాధికారిగా తిప్పరవేని వినయ్, కార్యవర్గ సభ్య లుగా రంజిత్, ముద్దంగుల గణేశ్ నియమించినట్లు తెలిపారు.



## ముదిరాజు సభ్యులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజానావ, గన్నేరువరం :**

గన్నవరం మండల పరిధిలోని చీమలకుంటపల్లి ముదిరాజ్ సభ్యులు ఒప్పందం ప్రకారం నడుచుకోడంలేదని, శనివారం మండల పరిధిలోని గునుకుల కొండాపూర్ ముదిరాజ్ సభ్యులు మల్లికార్జునకుంట వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 తేదీన మల్లికార్జున కుట కుంటలో సుమారు 50 వేలు విలువ గల చేప పిల్లలు వదిలామని, ఈ నెల 25 న చీమలకుంటపల్లి గ్రామ ముదిరాజ్ సభ్యులు చేప పిల్లలు వదిలి, ప్రచారం చేశారని, చేప పిల్లలు విషయం లో 2020 సంవత్సరంలో ఇరు గ్రామాల ముదిరాజ్ సభ్యులు ఒప్పందం చేసుకున్నామని, వారు హద్దులు మీరారని, చీమలకుంటపల్లి గ్రామ ముదిరాజ్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు . ఈకార్యక్రమంలో లో ముదిరాజ్ సభ్యులు గూడెల్లి మల్లేశం, చొక్కాల కొండయ్య , బుచ్చయ్య, నర్షయ్య ,బల్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలి:సీపీఐ

**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గంలో నిరుపేదకుటుంబాలకు ఇండ్ల స్థలాలు ఉండి, ఇంటి నిర్మాణం చేసుకోవాలనుకునే వారికి కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ప్రకారం తక్షణమే రూ.5 లక్షల లోన్ ఇవ్వాలని కోరారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని, వేములవాడ కూరగాయల మార్కెట్లో మహిళలకు టాయిలెట్లు, బాత్రూములు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే మార్కెట్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నేత రాములు కోరారు.

# భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా: ప్రభుత్వ విప్ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్**





**ప్రజానావ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి బద్ధిపోచమ్మ ఆలయం వరకు సిసిరోడ్డు నిర్మాణనికి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి,బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ లతో కలసి భూమి పూజ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్.. రాజన్న ఆలయం నుంచి బద్ధిపోచమ్మ ఆలయం వెళ్లే రహదారి భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించుకోవడం సంతోషం. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం..వేములవాడ పట్టణంతో రాజన్న ఆలయ అభివృద్ధి కృషి.. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా..వేములవాడ పట్టణంలో ప్రధాన రహదారిపై ఆగిపోయిన బ్రిడ్జిల నిర్మాణానికి భూసేకరణ కోసం ఇటీవల 6 కోట్ల96 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది..త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం..వేములవాడ పట్టణ అభివృద్ధి కి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.. త్వరలోనే వేములవాడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన..తెలంగాణ రాష్ట్రంలో ఒకే యారన్ డిపో మంజూరై 50 కోట్లతో వేములవాడకు కేటాయించడం సంతోషకరం..గతంలో యారన్ కావాలంటే ఇతర రాష్ట్రాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఉండేది.దీనివల్ల మన ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.. అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం పట్ల ప్రజలు హర్షిస్తున్నారు. పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు,స్థానిక ప్రజలు ఉన్నారు.



## ఆధ్య పత్తి రకంతో అధిక దిగుబడి

**ప్రజానావ, మహబూబ్‌నగర్:**

నూజివీడు సీడ్స్ వారు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జల్ మండలం రెడ్డిగూడ గ్రామంలో శనివారం రైతు సుధాకర్‌రెడ్డి పొలంలో ఆధ్య ప్రత్తి రకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్య ప్రత్తి రకం విత్తనాలు వేసుకున్న రైతులు తెగులు తక్కువగా త్వరగా పంట చేతికి వస్తుందని తెలిపారు. అన్ని నేలలకు అనుకూలంగా గూలబీ రంగు పురుగు ఉధృతిని తట్టుకొని మరీ రెండు కోతల్లోనే 80శాతం ప్రత్తి తీసుకొని, రెండో పంటకు(యాసంగి) వెళ్లొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎల్ ఆర్ఎం రాములు, ఏఎస్ నర్సింహులు, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీజీటీ భౌతిక శాస్త్రంలో బోధించేందుకు

# ఆహ్వానం

**- దౌల్తాబాద్ ఆదర్శ కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్**



**ప్రజానావ, దౌల్తాబాద్ :**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో పీజీటీ భౌతిక శాస్త్రం విభాగంలో తాత్కాలిక ఉపాధ్యాయులుగా గంటల ప్రాతిపదికన ఈ విద్యా సంవత్సరం బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతిక శస్త్రం విభాగంలో ఎమ్మెస్సీ భౌతిక శాస్త్రం, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అర్హతలు ఉండి ఆసక్తి, ఉత్సాహం గలవారు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు దుర్గ ప్రసాద్ తెలిపారు.

## ట్రైనీ అధికారులకు

# ఘన సన్మానం



**ప్రజానావ, రామాయంపేట:**

మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ కార్యాలయానికి ఆల్ ఇండియా సర్వీసెస్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రామాయంపేట మండలానికి వచ్చిన ట్రైనింగ్ అధికారులు మూడు రోజులపాటు రామయంపేట పట్టణంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో సెక్షన్లలో పూర్తిస్థాయిలో వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు

# ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్?

**ప్రజానావ, హైదరాబాద్:**

కానిస్టేబుల్స్ కుటుంబాలు రోడ్డు మీదకు రావటానికి సీఎం రేవంత్ కారణమని ఆరోపించారు మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఇవాళ తెలంగాణ భవన్ లో సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హోంశాఖ నిర్వహిస్తోన్న రేవంత్ ఫెయిల్ అవ్వటం వలనే పోలీస్ కుటుంబాలు బయటకు వచ్చాయని, రక్షక భటులే న్యాయం కావాలని రోడ్డు ఎక్కటం బాధాకరమన్నారు. పోలీసులు రోడ్డు ఎక్కటం చరిత్రలోనే మెదటసారి అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజా పాలన అంటే.. ఇదేనా రేవంత్ రెడ్డి? అని ఆమె ప్రశ్నించారు. హోంమంత్రి లేకపోవటం వలన.. కానిస్టేబుల్స్ బాధ ఎవరకి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి అని, యూనిఫాం వేసుకుని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి తెలంగాణలో వచ్చిందని ఆమె మండిపడ్డారు. అంతేకాకుండా.. అయినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం బాధాకరమని సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్ మాటను నిలబెట్టుకోవాలని, 18రోజులకు... 4రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలన్నారు. పిల్లలు కూడా తండ్రులను గుర్తుపట్టని పరిస్థితులు పోలీస్ కుటుంబాలవని, మహిళలపై అఘాయిత్యాలు రాష్ట్రంలో సర్వసాధారణంగా మారాయన్నారు సబితా ఇంద్రారెడ్డి. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు

# సీఎం రేవంత్ పరామర్శ









**ప్రజానావ, వికారాబాద్:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం మద్దూర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివరాజ్ కుమారుడు సతీష్, రేగడి మైలరం గ్రామంలో నర్సిరెడ్డి కుటుంబాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మరణించిన కాంగ్రెస్ నేతల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీనిచ్చారు. ముఖ్యమంత్రితో పాటు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

# బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

**జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి**



**ప్రజానావ, మెదక్ :**

దీపావళి పండుగ సందర్భంగాబాణసంచా దుకాణాదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో తాత్కాలిక బాణసంచా దుకాణాలు నెలకొల్పేవారు పోలీస్ డివిజినల్ అధికారి కార్యాలయం నుండి దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. ఎవరైనా సంబంధిత పోలీస్ డివిజినల్ స్థాయి అధికారి నుండి అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలను నెలకొల్పితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### ఈ నిబంధనలు పాటించాల్సిందే

- బాణసంచా దుకాణాలు ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పాలి. ఎన్‌ఓసీ సర్టిఫికేట్ పొందపర్చాలి.
- ఒక క్లస్టర్‌లో 50 షాపులకు మించరాదు.
- రద్దీ ప్రదేశాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయొద్దు. అదేవిధంగా కళ్యాణ మండపాల్లో, సమావేశాల కేంద్రాల్లో టపాకాయల దుకాణాలు నెలకొల్పరాదు.
- బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు ఫైర్‌కు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- దుకాణాల సమీపంలో ఇసుక, నీరు, రెండు ఫైర్ ఎక్స్‌ట్రిమిషన్‌లు ఉంచాలి.
- బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలి.
- టపాసుల దుకాణానికి నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్, ఫైర్ శాఖతో పాటు మున్సిపల్ శాఖల ఎన్‌ఓసీ అనుమతి తప్పనిసరి.
- దుకాణాదారులు తీసుకున్న లైసెన్సులు 3 రోజుల వరకు మాత్రమే వర్తిస్తాయి.
- దుకాణంలో ల్యాంప్‌లు, పెట్రోమ్యాక్స్‌లు పాత కరెంట్ తీగలు ఉంచరాదు. జాయింట్ కేబుల్స్ వాడకూడదు.
- జనరేటర్ 15 నుంచి 20 మీటర్ల దూరంలో ఉండాలి.
- దుకాణంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన వారే పనిచేయాలి.
- గోదాం ఊరికి 5 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు టెక్నో స్కూల్ విద్యార్థులు



**ప్రజానావ, శామీర్‌పేట్:**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలో గల విజేత టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ రాంరెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 25వ తేదీన వికారాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్ 17 బాలుర విభాగంలో వై. జస్వంత్, అంకుష్‌రెడ్డి, అండర్ 14 బాలబాలికల విభాగంలో అక్షిత,శ్రావణి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 28, 29, 30 తేదీల్లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థు

# రక్తదానం.. ప్రాణదానం

**సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్**



**ప్రజానావ, సిరిసిల్ల:**

సిరిసిల్ల, ప్రజానావ: రక్తదానం.. ప్రాణదానమని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల, వరంగల్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో పాటు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెల కట్టలేమన్నారు. అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు ప్రజలంతా శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారన్నారు. రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడూ ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి పెద్ద సంఖ్యలో యువకులు ముందుకొచ్చి ఉత్సాహంగా పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. అమరవీరుల స్మారకార్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లాలోని యువకులు పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ లు, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు

# డీఏ మంజూరుపై హర్షం



**ప్రజానావ, ఖైరతాబాద్:**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏ విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విడుదల కానున్న ఒక డీఏపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు డీఏలు ఇవ్వాల్సి ఉండగా.. ఒక డీఏకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిపై తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) స్పందించింది. ప్రభుత్వం ఒక డీఏ విడుదల చేయడంపై జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వీ. లచ్చిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. డీఏ మంజూరుపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డీఏలకు ఎట్టకేలకు ప్రభుత్వం ఓకే చెప్పడం శుభసూచకం అన్నారు. రాష్ట్రం ఆర్థికమైన విపత్తులో ఉన్నప్పటికీ ప్రజా పరిపాలనలో మమేకమవుతున్న ఉద్యోగుల పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనంగా రేవంత్ రెడ్డి సర్కారు ఉందని నిరూపించారన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో డీఏల చెల్లింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడిన అనంతరం జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఒకే డీఏ మంజూరు చేయడం సంతోషమే కానీ మిగతా సమస్యలను కూడా దశల వారీగా పరిష్కరించాలని రేవంత్ రెడ్డిని కోరారు. గత ప్రభుత్వంలో నాలుగు, ప్రస్తుత ప్రభుత్వంలో ఒకటి చొప్పున డీఏలు పెండింగ్ ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుతం ఒక డీఏను ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులకు కొంతమేర ఉపశమనం కలిగిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మిగతా డీఏలను దశలవారీగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ, బదిలీలు తదితర అంశాలపై కూడా ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

# నీటి దోపిడీ చేస్తున్నారని ఫిర్యాదు





**ప్రజానావ, తూప్రాన్:**

మాజీ సీఎం కేసీఆర్ బంధువు పేరు మీద హల్ది వాగు నుండి నీటిని అక్రమంగా తొడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తూప్రాన్, కిష్టాపూర్‌కు చెందిన రైతులు ఆర్డీవో జయచంద్రారెడ్డి, ఇరిగేషన్ ఏఈ అనురాదలకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్, కిష్టాపూర్ శివారులో ఉన్న హల్ది వాగు నుండి కొందరు వ్యక్తులు అక్రమంగా మోటార్లు పెట్టి నీటిని తొడుకునేందుకు చూస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మమిండ్ల అనిల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# వయసా మరలవే !

వృద్ధాప్యాన్ని ఆపితే? ఆ మాటకొస్తే వెనక్కి తిప్పితే? మనకు అసాధ్యమేమోగానీ శాస్త్రవేత్తలు తలచుకుంటే కానిదేముంది? యాంటీబయాటిక్ మందుల ఆవిష్కరణతో ఇన్‌ఫెక్షన్ మరణాలను గణనీయంగా తగ్గించి, ఫలితంగా జీవనకాలాన్నీ పెంచిన శాస్త్రరంగం ఇప్పుడు ఆయుష్షును పెంచటం మీదా దృష్టి సారించింది. వయసు మీరే ప్రక్రియను అర్థం చేసుకునే దిశగా పురోగతీ సాధించింది. వ్యాధి కారక కణాలను నిర్మూలించగల మాత్రలను కనుగొనటం దగ్గరి నుంచి జెల్లీఫిష్ పునరుజ్జీవనం వెనక రహస్యాలను ఛేదించటం వరకూ శాస్త్రవేత్తలు ఎన్నెన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. వాన పాములు, కోతుల వంటి జంతువులను ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించేలా చేయగలుగుతున్నారు. ప్రస్తుతానికి చాలా పరిశోధనలు ఎలుకల వరకే పరిమితమైనప్పటికీ వీటిల్లో కొన్నయినా త్వరలోనే మనుషుల మీద ప్రయోగ పరీక్షల దశకు చేరుకోవచ్చని ఆశిస్తున్నారు. అన్నీ సవ్యంగా సాగితే మరో పదేళ్లలోనే వీటి ఫలితాలను చవి చూసినా ఆశ్చర్యపోనవసరం లేదు. మరణాన్ని జయించ లేకపోయినా ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించొచ్చన్నది నిస్సందేహం. అలాంటి కొన్ని ప్రయత్నాలు ఇవిగో..



**ఐస్‌లాండ్‌లో అద్భుత మందు**

భారీ రాతి బొమ్మలకు నిలయమైన ఐస్‌లాండ్ అద్భుతమైన మందునూ ప్రసాదించింది. అదే రాపామైసిన్. దీన్ని 60ల్లో అక్కడి నేలలో గుర్తించారు. బ్యాక్టీరియా జాతులతో పుట్టుకొచ్చే ఇది క్యాన్సర్ చికిత్సలకు, రోగనిరోధకశక్తిని అణచి పెట్టటానికి తోడ్పడుతుంది. అంతేకాదు.. గతి తప్పిన ప్రొటీన్లనూ అడ్డుకుంటుంది. మన శరీరం సజావుగా పని చేయటానికి తోడ్పడే ప్రొటీన్లు గతి తప్పితే విషతుల్యాలుగా మారతాయి. అదృష్టం కొద్దీ మన శరీరంలో స్వీయ భక్షణ (ఆటోఫేజీ) ప్రక్రియ కొన సాగుతూ ఉంటుంది. దీని మూలంగానే కణాలు గతి తప్పిన అణువులను దారిలోకి తేవటం, సరికొత్తగా తయారుచేయటం సాధ్యమవుతోంది. ఇక్కడే రాపామైసిన్ ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది గతి తప్పిన ప్రొటీన్లను ఊడ్చి వేయటానికి కణాలకు అవసరమైన శక్తిని ప్రసాదిస్తుంది. ఇలా వయో ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది ఎలుకల్లో 20% వరకూ ఆయుష్షును పెంచినట్టు ప్రయోగ పరీక్షల్లో బయటపడింది. గుండె, చిగుళ్ల జబ్బుల వంటి వాటినీ తగ్గిస్తున్నట్టు వెల్లడైంది. ఈస్ట్, నేలపాములు, ఈగల జీవనకాలాన్నీ పెంచుతున్నట్టు తేలింది. వృద్ధుల్లోనూ రాపామైసిన్ ఇలాంటి ప్రభావమే చూపుతుండటం విశేషం.

**శిశువుల్లో దాగిన రహస్యం**

శిశు జననం అద్భుతమైన ప్రక్రియ. జీవ నిర్మాణం ఏదో ఒక స్థాయిలో వృద్ధాప్య ప్రక్రియను వెనక్కి మళ్లించిందనటానికిదో నిదర్శనమనీ చెప్పుకోవచ్చు. ఎందుకంటే తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన కణాలతోనే పిండం అభివృద్ధి చెందుతుంది. అంటే వారిలోని పాత కణాలు తిరిగి తొలి వయసు నుంచి పురుడు పోసుకుంటున్నాయన్న మాట. ఇది వివిధ రకాల ప్రాణుల్లో అంతగా క్షీణించకుండా తరతరాలుగా, లక్షలాది ఏళ్లుగా కొనసాగుతూ వస్తుండటం విశేషం. పిల్లల్లో ఇదెలా సంభవమో తెలుసుకుంటే పెద్దవారిలోనూ వయో ప్రక్రియను నిలువరించొచ్చా? టురిటోప్సిస్ డోర్నీ అనే 'అమర' జెల్లీఫిష్‌లు దీన్ని సాధించనట్టే కనిపిస్తోంది. ఇవి ఒత్తిడికి గురైనప్పుడు తమ వయో ప్రక్రియను శిశు దశకు మళ్లిస్తాయి. తిరిగి మొదటి నుంచీ పునరుజ్జీవం చెందుతాయి. ఇలా ఎన్నిసార్లయినా చేస్తాయి కూడా. వయసును వెనక్కి మళ్లించటమనేది జీవనశాస్త్ర నియమాలకు విరుద్ధం కాదనే సంగతిని ఇవి రుజువు చేస్తున్నాయి. మనుషుల్లోనూ ఇది సాధ్యమైతే? పరిపక్వ కణాల్లో గడియారాన్ని వెనక్కి తిప్పొచ్చని 2012 నోబెల్ గ్రహీత ప్రొఫెసర్ షిన్యా ఎమనక, ప్రొఫెసర్ జాన్ గుర్డాన్ నిరూపించారు కూడా. కేవలం నాలుగు జన్యువులతోనే ఇది సాధ్యమవుతున్నట్టు, ఇవి పాత కణాలను తిరిగి మూల కణాలుగా మారుస్తున్నట్టు తేలింది. ఈ ప్రక్రియను మనుషులకు ఎలా వర్తింపజేయొచ్చనేది ఇంకా తెలియనప్పటికీ అమెజాన్ సంస్థకు చెందిన ఆల్టోస్ ల్యాబ్ దీని మీద గట్టిగానే కృషి చేస్తోంది. ఎలుకల్లో జీవనకాలం 25% పెరిగినట్టు ప్రాథమిక ఫలితాలు చెబుతున్నాయి. పూర్తిస్థాయి ఫలితాలు వెలువడితే అది గొప్ప విషయమే కాగలదు.

**వృద్ధ కణాల ఊడ్చివేత**

శరీరం వెలుపల కణ విభజన నిరంతరం కొనసాగుతుందని ఒకప్పుడు భావించేవారు. అయితే 50 సార్లు విభజన చెందిన తర్వాత, ఈ ప్రక్రియ ఆగిపోతున్నట్టు లియోనార్డ్ హేఫ్లిక్ 1961లో గుర్తించారు. ఇవి వృద్ధాప్యానికి చేరుకుంటున్నట్టు బయటపడింది. మనుషులు, జంతువుల్లోనూ ఇవి వృద్ధాప్యానికి కారణమవుతున్నాయా? దీనికి అవుననే సమాధానం వస్తోంది. వయసు మీద పడుతున్నకొద్దీ శరీరంలో ఇలాంటి కణాలు పోగుపడుతూ వస్తుంటాయి. మంచి విషయం ఏంటంటే వీటిని ఊడ్చివేసే, నిర్మూలించే మందులను ఆవిష్కరించటం. డాసాటినిబ్ అనే కీమోథెరపీ మందు.. పండ్లు, కూరగాయల్లోని క్వెర్‌సెటిన్ అనే రుచి కారకం ఎలుకల్లో 'వృద్ధ' కణాలను నిర్మూలించి, మంచి ఆరోగ్యంతో ఎక్కువ కాలం జీవించేలా చేస్తున్నట్టు బయటపడింది. క్యాన్సర్, గుండెజబ్బుల వంటి వ్యాధుల నివారణకే కాకుండా శరీరానికి ఇంకాస్త బలాన్నీ ఇస్తున్నట్టు వెల్లడైంది. కంపెనీలు ఇలాంటి మరికొన్ని మందులను రూపొందించటం మీదా దృష్టి సారించాయి. వీటిల్లో ఏది సఫలమైనా వయో ప్రక్రియను ఆపే దిశగా కొత్త ముందడుగు పడినట్టే.

**ఇప్పటికే ఉన్న ఔషధాలతోనూ..**

ఇతర జబ్బులకు వాడుతున్న కొన్ని ఔషధాలూ వయో ప్రక్రియను అడ్డుకోవటం గమనార్హం. ఉదాహరణకు మధుమేహానికి వాడే ఎస్‌జీఎల్‌టీ2 ఇన్‌హిబిటార్స్ రకానికి చెందిన కానాగ్లిఫ్లోజిన్, డాపాగ్లిఫ్లోజిన్, ఎంపాగ్లిఫ్లోజిన్‌లనే చూడండి. ఇవి గ్లూకోజును తగ్గించటంతో పాటు మొత్తంగా ఆరోగ్యాన్ని మెరుగు పరచే పనినీ చేపడుతున్నాయి. ఇలా ఆయుష్షు పెరిగేలా చేస్తున్నాయి. కానాగ్లిఫ్లోజిన్ ఎలుకల్లో 14% వరకు జీవనకాలాన్ని పొడిగిస్తున్నట్టు వెల్లడైంది. గ్లూకోజును తగ్గించే మెట్‌ఫార్మిన్, అకార్బోస్.. ఎముకల పటుత్వాన్ని కాపాడే బిస్‌ఫాస్ఫేట్ రకం మందులు సైతం మంచి ఫలితం చూపుతున్నాయి. బరువు తగ్గటానికి కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెమాగ్లుటైడ్ కూడా ఆశలు రేపుతోంది. ఇది తక్కువ ఆహారం తినేలా చేయటం ద్వారా జంతువుల్లో జీవనకాలాన్ని పెంచుతున్నట్టు బయట పడింది. ఈ మందులు ఇప్పటికే అందు బాటులో ఉండటం మరింత ఆసక్తి కరమైన విషయం.

**ఔషధాలను మిళితం చేసి..**

ఒక్కో మందుతోనే సమర్థ ఫలితాలు కనిపిస్తున్నప్పుడు అన్నింటికీ కలిపితే? శాస్త్రవేత్తలు ఈ దిశగానూ ప్రయత్నించారు. రాపామైసిన్, అకార్బోస్ మందుల కలయిక మంచి ప్రభావం చూపిస్తున్నట్టు తేలింది. వీటి సాయంతోనే ఒక ఎలుక ప్రస్తుతం ఎక్కువకాలం జీవిస్తున్న మూషిక రికార్డును కొట్టేసింది. రాపామైసిన్ రక్తంలో గ్లూకోజు మోతాదులను అస్తవ్యస్తం చేస్తుంది. దీన్ని అడ్డుకోవటానికే అకార్బోస్‌ను జోడించారు. వీటి కలయికతో మగ ఎలుకల్లో 40%, ఆడ ఎలుకల్లో 30% జీవనకాలం పెరగటం విశేషం. రాపామైసిన్, వృద్ధ కణాలను నిర్మూలించే మందు, డీఎన్ఏ మీది రక్షణ టోపీలను బలోపేతం చేసే చికిత్స, ఎముక మజ్జ మార్పిడి.. ఇలా నాలుగు పద్ధతులను మేళవించీ శాస్త్రవేత్తలు ప్రయోగాలు నిర్వహించారు. ఇదీ ఆయుష్షును



## ల్యాప్‌టాప్ బ్యాటరీ మన్నికగా

ముందూ వెనకా చూడకుండా రోజూ ల్యాప్‌టాప్‌ను ఛార్జ్ చేస్తూనే ఉంటాం. ప్లగ్ తగిలించేసి ఏవేవో పనులు చేసుకుంటాం. బ్యాటరీ ఫుల్ అయ్యాక ప్లగ్ తీసేస్తాం. అయితే ఛార్జింగ్ అలవాట్లు బ్యాటరీ మన్నిక, పనితీరు మీద ప్రభావం చూపుతాయనే సంగతి తెలుసా? ల్యాప్‌టాప్‌ను సరైన విధంగా ఛార్జ్ చేయకపోతే బోలెడన్ని చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరమ్మతు చేయాల్సి వస్తే ఖర్చు అవుతుంది. అందువల్ల ల్యాప్‌టాప్ ఛార్జింగ్ విషయంలో చేయాల్సినవి, చేయకూడనివి ఏంటో చూద్దాం.

**చేయాల్సినవి:** ఎప్పుడైనా సరే ల్యాప్‌టాప్‌తో వచ్చిన లేదా కంపెనీ సిఫారసు చేసిన ఛార్జర్‌నే వాడాలి. థర్డ్ పార్టీ లేదా అనధీకృత ఛార్జర్ ఉపయోగిస్తే ల్యాప్‌టాప్ బ్యాటరీ, ఇతర భాగాలు దెబ్బతినే ప్రమాదముంది. ఇతర, నకిలీ ఛార్జర్లు తగినంత వోల్టేజీ ఇవ్వవు. ఫలితంగా ఓవర్ హీట్ కావొచ్చు. క్రమంగా ల్యాప్‌టాప్ చెడిపోవచ్చు. దిండు, తువ్వాలు, దుప్పట్ల వంటి మెత్తటి వస్తువులపై కాకుండా ఉపరితలం గట్టిగా, చదునుగా ఉండే బల్లల వంటి వాటి మీద ల్యాప్‌టాప్‌ను పెట్టి ఛార్జ్ చేయాలి. మెత్తటి వస్తువులు వేడిని పట్టి ఉంచుతాయి. గాలి సరిగా ఆడకుండా, చల్లబడకుండా చేస్తాయి. దీంతో బ్యాటరీ అతిగా వేడెక్కుతుంది. ఇది అసౌకర్యం కలిగించటమే కాదు, ల్యాప్‌టాప్ లోపలి భాగాలు కూడా దెబ్బతినొచ్చు. ల్యాప్‌టాప్‌కు అతిగా చల్లదనం, వేడి తగలకుండా చూడాలి. అతి వేడితో బ్యాటరీ బాగా దెబ్బతినొచ్చు. అతి చల్లదనంతో సామర్థ్యం తగ్గొచ్చు. ఉదాహరణకు బాగా వేడిగా ఉన్న కారులో లేదా గడ్డకట్టించే చలిలో ల్యాప్‌టాప్‌తో పనిచేస్తుంటే బ్యాటరీ సామర్థ్యం, మన్నిక తగ్గుతాయి. కొద్దిసేపు ల్యాప్‌టాప్‌ను వాడి, ఆ వెంటనే ఛార్జ్ చేయటం మంచిది కాదు. వీలైనంతవరకూ బ్యాటరీ ఛార్జింగ్ 20% నుంచి 80% మధ్యలో ఉండేలా చూసు కోవాలి. దీంతో మన్నిక, సామర్థ్యం మెరుగవుతాయి. ల్యాప్‌టాప్ బ్యాటరీని అప్పుడప్పుడూ గమనిస్తూ ఉండాలి. ఉబ్బినట్టు అనిపిస్తే వెంటనే ఆపెయ్యాలి. నిపుణులకు చూపించి తనిఖీ చేసుకోవాలి. రోజూ వాడే క్రమంలో క్షీణించటంతోనే కాదు, బ్యాటరీ దెబ్బతినటం మూలంగానూ ఉబ్బొచ్చు. ఇది ప్రమాదానికి దారితీయొచ్చు.

**చేయకూడనివి**

గేమింగ్, వీడియో ఎడిటింగ్ వంటి పనులకు ఎక్కువ విద్యుత్తు అవసర మవుతుంది. ఇలాంటివి చేసేటప్పుడు ఛార్జింగ్ పెడితే ఎక్కువ వేడి పుట్టుకొస్తుంది. బ్యాటరీ మీద ఎక్కువ భారం పడుతుంది. అతిగా వేడెక్కొచ్చు. ఒకవేళ పని చేస్తున్నప్పుడు ఛార్జింగ్ పెట్టాలని అనుకుంటే మామూలు పనులు చేయాలి. ల్యాప్‌టాప్ చల్లబడేలా మధ్యమధ్యలో విరామం ఇవ్వాలి. ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుంటే సౌకర్యంగానే ఉంటుంది. కానీ ఇది వేడి బయటకు వెళ్లకుండా, చల్లబడకుండా చేయొచ్చు. పరికరం అతిగా వేడెక్కితే క్రమంగా దెబ్బతింటూ వస్తుంది. అందువల్ల ఎప్పుడైనా చదునైన ఉపరితలాల మీద పెట్టే ఛార్జ్ చేయాలి. దీంతో ఛార్జ్ అవుతున్నప్పుడు సరిగ్గా చల్లబడుతుంది. నిజానికి అలాగే ప్లగ్ పెట్టి ఉంచినా చాలా ల్యాప్‌టాప్‌లు తట్టుకుంటాయి. అయినా కూడా నిరంతరం ఛార్జ్ చేస్తూ ఉండటం మంచిది కాదు. దీర్ఘకాలంలో ఇది బ్యాటరీ నైపుణ్యాన్ని తగ్గిస్తుంది. పూర్తిగా ఛార్జ్ అయ్యాక ప్లగ్ తీసేయటం ఉత్తమం. ఛార్జర్ చెడిపోయినా, కేబుల్ తెగినా వెంటనే మార్చుకోవాలి. దెబ్బతిన్న యాక్సెసరీస్ వాడటం ప్రమాదకరమే కాదు, ల్యాప్‌టాప్ సైతం దెబ్బతినొచ్చు. తెగిన తీగలతో విద్యుత్తు సరిగా సరఫరా కాదు. ఇది తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. బ్యాటరీని పూర్తిగా ఛార్జ్ చేసి, స్టోర్ చేస్తే త్వరగా సామర్థ్యం క్షీణిస్తుంది. కాబట్టి ఎక్కువకాలం ల్యాప్‌టాప్‌ను స్టోర్ చేయాలనుకుంటే 50% కన్నా తక్కువగా ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలి. అలాగని ఛార్జింగ్ పూర్తిగా నిండుకునేలా చూడొద్దు.



# సూపర్ పరిజ్ఞానాలు

సాంకేతిక పరిజ్ఞాన (టెక్నాలజీ) రంగం శరవేగంగా సాగుతోంది. నిన్నటి పద్ధతులు నేడు పాత పడిపోతున్నాయి. వాటి స్థానంలో వినూత్న పరిజ్ఞానాలు వచ్చి చేరుతున్నాయి. వీటి ప్రాముఖ్యతను, ప్రభావాన్ని గుర్తించటం ఎంతైనా అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకునే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ తాజాగా 'టాప్ టెన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఆఫ్ 2024' నివేదికను విడుదల చేసింది. ప్రపంచం మీద ప్రభావం చూపగల అత్యున్నత పరిజ్ఞానాల జాబితాను గుదిగుచ్చింది. ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాల మేరకు ఎంపికచేసిన ఈ అధునాతన, వినూత్న పరిజ్ఞానాల వివరాలు, విశేషాలేంటో చూద్దాం.

**గోప్యతకు ధీమా**

ఏఐ మూలంగా డేటా ప్రపంచమూ మునుపెన్నడూ లేనంతగా విస్తరిస్తోంది. దీంతో నైతికత, భద్రత కీలక వ్యవహారాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో గోప్యతను పెంచే 'సింథటిక్ డేటా' పరిజ్ఞానం తిరిగి పురుడు పోసుకుంటోంది. ఇది సున్నిత సమాచారం తీరుతెన్నులు, ధోరణులను ప్రతిబింబిస్తుంది. కానీ వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాలకు సంబంధించిన సమాచారంతో వీటికి సంబంధమూ ఉండదు. ఇది వాస్తవ వనరుల నుంచి సేకరించిన సమాచారాన్ని తీసుకోదు. తనే కృత్రిమంగా డేటాను సృష్టిస్తుంది లేదా సిమ్యులేట్ చేస్తుంది. అయితే ఇది వాస్తవ డేటాను పోలి ఉండటం వల్ల గోప్యత, భద్రత మెరుగవుతాయి. వ్యక్తిగత, రహస్య వివరాలు బయటకు వెల్లడి కావు. అధునాతన ఏఐ టూల్స్‌తో రూపుదిద్దుకునే ఇది ప్రపంచ వ్యాప్తంగా డేటాను పంచుకోవటానికి శాస్త్రవేత్తలకు వీలు కల్పిస్తుంది. సమాచార గుర్తింపును తొలగించటం ద్వారా జీవశాస్త్రం, ఆరోగ్యానికి సంబంధించిన పరిశోధనలు సంయుక్తంగా నిర్వహించుకునేలా చేస్తుంది.

**ఉపరితలాలే ప్రసార సాధనాలు**

ప్రపంచంలో విద్యుత్తు వాడకాన్ని తగ్గించటానికి ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. ఒకవైపు కృత్రిమ మేధ సాధనాలు విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. మరోవైపు 6జీ టెక్నాలజీ ఎప్పుడెప్పుడు అడుగు పెడదామా అని ఎదురు చూస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుస్థిర పద్ధతులతో తక్షణం డేటాను అందించటమెలా? 'రీకన్ఫిగరేబుల్ ఇంటెలిజెంట్ సర్ఫేసెస్' (ఆర్ఐఎస్) పరిజ్ఞానం కొత్త ఆశా కిరణంగా కనిపిస్తోంది. మెటా మెటీరియల్స్, స్మార్ట్ ఆల్గారిథమ్‌ల మేళవింపుతో ఇది వైర్‌లెస్ సమాచార ప్రసారాన్ని గణనీయంగా మలుపు తిప్పగలదు. చదునైన ఉపరితలాల మీద యూనిట్ సెల్స్‌ను అమర్చటం దీనిలోని ప్రత్యేకత. వీటి మీద ప్రతిబింబం, వికిరణం, కేంద్రీకరణ, ఘర్షణ, పరివర్తన, శోషణల ద్వారా వైర్‌లెస్ సంకేతాలను అనుకున్నట్టుగా ప్రసారమయ్యేలా మార్చుకోవచ్చు. దీన్ని ఆఫీసులు, విమానాశ్రయాలు, మాల్స్, స్తంభాలు, ప్రకటనల బోర్డులు.. ఇలా లోపలా బయటా ఎక్కడైనా ఏర్పాటు చేయొచ్చు. ఆర్ఐఎస్ ఎలాంటి రూపంలోకైనా మారగలదు. ఆయా వస్తువుల మీద సమ్మిళితం కాగలదు. ఒక్కమాటలో చెప్పాలంటే వైర్‌లెస్ నెట్‌వర్క్‌లో మామూలు గోడలు, ఉపరితలాలనూ ఇంటెలిజెంట్ సాధనాలుగా మార్చగలదు.

**ఏఐ శాస్త్రీయ ఆవిష్కరణ**

శరవేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) శాస్త్రీయ పరిశోధనలనూ గతి తిప్పుతోంది. అందుకే పురోగమిస్తున్న పరిజ్ఞానాల జాబితాలో 'ఏఐ ఫర్ సైంటిఫిక్ డిస్కవరీ' తొలి స్థానం దక్కించుకుంది. తమ విజ్ఞానాన్ని, సామర్థ్యాలను ఇనుమడింప చేసుకోవటానికి శాస్త్రవేత్తలు చాలాకాలంగా ఏఐని వాడుకుంటున్నప్పటికీ డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ, ఫౌండేషన్ మోడళ్లలో ఇటీవల వచ్చిన అధునాతన మార్పులు శాస్త్రీయ ఆవిష్కరణలు, అంచనాల వేగాన్ని మరింత వేగవంతం చేస్తున్నాయి. ఉదాహరణకు డీప్ మైండ్ సంస్థకు చెందిన ఆల్ఫాఫోల్డ్ పరిజ్ఞానం ప్రొటీన్ నిర్మాణాలను 3డీ రూపంలో కచ్చితంగా అంచనా వేసి ఆశ్చర్యపరుస్తోంది. కొత్త తరం యాంటీబయాటిక్ మందులను కనుగొనే పరిశోధనలకూ ఏఐ సాయం చేస్తోంది. మరింత సమర్థమైన బ్యాటరీల రూపకల్పనకూ దీన్ని వాడుకుంటున్నారు. ప్రతి శాస్త్రీయ విభాగాన్నీ ఏఐ కొత్త మలుపు తిప్పగలదని, ఇప్పుడు అనుసరిస్తున్న చాలా పద్ధతులను మార్చివేయగలదని అమెరికా అధ్యక్షుడి సైన్స్ అండ్ టెక్నాలజీ సలహా మండలి నివేదిక అభిప్రాయపడటం గమనార్హం. శాస్త్ర పరిశోధన, ఆవిష్కరణల్లో కృత్రిమ మేధ ఎలాంటి ప్రభావం చూపగలదో అనటానికి ఇదే నిదర్శనం.

**సెన్సింగ్ అండ్ కమ్యూనికేషన్ సమ్మిళితం**

సెన్సింగ్, కమ్యూనికేషన్స్ పరికరాలు వెల్లువెత్తుతున్న తరుణంలో కొన్నిసార్లు ఇవి రెండూ ఒకదాంతో మరోటి కలిసిపోయే ప్రమాదముంది. వీటిని ఒకే వ్యవస్థగా సమ్మిళితం చేయటానికి 'ఇంటిగ్రేటెడ్ సెన్సింగ్ అండ్ కమ్యూనికేషన్స్' (ఐఎస్ఏసీ) తోడ్పడుతుంది. ఇది ఒకేసారి సమాచారాన్ని సేకరిస్తుంది, ప్రసారం చేస్తుంది. ఆయా పరిసరాలు, వాతావరణాలను వైర్‌లెస్ నెట్‌వర్క్‌లు గుర్తించగలిగేలా చేస్తుంది కూడా. సెన్సర్లు, డేటా అనలిటిక్స్ గాలి, నీరు నాణ్యత, నేలలో తేమ, వాతావరణ పరిస్థితులను పర్యవేక్షించటానికీ తోడ్పడతాయి. స్మార్ట్ వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, పట్టణ ప్రణాళిక వంటి వాటికీ ఇది ఉపయోగపడుతుంది. విద్యుత్తు ఉత్పత్తి, వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచుకునేలా స్మార్ట్ గ్రిడ్స్‌కూ సాయం చేస్తుంది.

**నిర్మాణాలకు ఇమ్మర్సివ్ టెక్నాలజీ**

భవనాలు, నిర్మాణ రంగాలు రోజుకోజుకీ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అయితే కర్బన ఉద్గారాలు విడుదల కావటమే పెద్ద సమస్యగా నిలుస్తోంది. సుమారు 40% కర్బన ఉద్గారాలకు భవన, నిర్మాణ రంగాలే కారణమవుతుండటం గమనార్హం. వీటిని తగ్గించటానికి, భవిష్యత్ స్వచ్ఛ ప్రపంచం దిశగా 'ఇమ్మెర్సివ్ టెక్నాలజీ' చేదోడుగా నిలుస్తోంది. ఏఐ ఆధారిత నిర్మాణ పరికరాలు ఇందులో కీలక పాత్ర పోషించనున్నాయి. ముమ్మందు ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయటానికి, ప్రాజెక్టులతో వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందటానికివి తోడ్పడనున్నాయి. ఉదాహరణకు డిజిటల్ ట్విన్స్ పరిజ్ఞానంతో సంక్లిష్ట ప్రాజెక్టులను సిమ్యులేట్ చేయొచ్చు. సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. కాల్పనిక ప్రయోగాలు, పరిశోధనల సమ్మేళనంతో కచ్చితత్వాన్ని మెరుగు పరచుకోవచ్చు.

**కర్బన సంగ్రహణ క్రిములు**

వాతావరణ సంక్షోభం ముంచుకొస్తున్న తరుణంలో సూక్ష్మక్రిములు విలువైన పరిష్కారాలను చూపుతున్నాయి. ఇవి గాలి నుంచి.. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే గ్రీన్‌హౌజ్ వాయువుల నుంచి కార్బన్‌ను సంగ్రహించటమే కాకుండా దాన్ని జీవ ఇంధనాల వంటి విలువైన ఉత్పత్తులుగానూ మార్చగలవు. భూతాపం తగ్గటానికిది ఎంతగానో దోహదం చేస్తుంది. సూక్ష్మక్రిములతో కార్బన్‌ను ఒడిసిపట్టటంలో ప్రధానంగా రెండు పద్ధతులున్నాయి. సైయానోబ్యాక్టీరియా, మైక్రోఆల్గే వంటి క్రిములు కిరణజన్య సంయోగక్రియ ద్వారా కార్బన్‌ను 'భుజిస్తాయి'. మరో రకం క్రిములేమో హైడ్రోజన్, సేంద్రీయ వ్యర్థాల వంటి పునరుత్పాదక ఇంధన వనరుల సాయంతో కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహిస్తాయి. దీన్ని జీవ ఇంధనం, ప్రొటీన్‌తో కూడిన దాణా వంటి కొత్త పదార్థాలుగానూ మారుస్తాయి.

**భూమికి ఎగువన అంతర్జాల కేంద్రాలు**

ప్రస్తుతం ప్రపంచంలో సగం మంది జనాభా అంతర్జాల సేవలు, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని వాడుకుంటున్నారు. కానీ మారుమూల ప్రాంతాలకు ఇంకా ఇవి అందుబాటులో లేవు. ఈ కొరతను తీర్చటంలో 'హైఅల్టిట్యూడ్ ప్లాట్‌ఫామ్ స్టేషన్' (హెచ్ఏపీఎస్) వ్యవస్థలు కొత్త సాధనాలుగా ముందుకొస్తున్నాయి. వీటితో మారుమూల ప్రాంతాలకూ స్థిరమైన బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందుతుంది. మొబైల్ పరికరాలు, కీలక నెట్‌వర్క్‌ల మధ్య ఇవి ప్రసార మాధ్యమాలుగా ఉపయోగపడతాయి. పర్వతాలు, తీర ప్రాంతాలు, ఎడారుల వంటి చోట్ల కూడా వైర్‌లెస్‌గా అంతర్జాల సేవలను పొందటానికి దోహదం చేస్తాయి. భూమికి 20 కి.మీ. ఎత్తులో హెచ్ఏపీఎస్ వ్యవస్థలను నెలకొల్పుతారు. బెలూన్, ఎయిర్‌షిప్‌లు లేదా విమానం రెక్కల మీదా ఏర్పాటు చేయొచ్చు. వీటి



ద్వారా 100 దేశాల్లోని 260 కోట్ల మందికి ఇంటర్నెట్ సేవలు అందగలవు. ఫలితంగా విద్య, ఆర్థిక వృద్ధి అవకాశాలు మెరుగవుతాయి. వీటిని సత్వరం నెలకొల్పే అవకాశం ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లోనూ వాడుకోవచ్చు.

**చల్లదనానికి ఎలస్టోకెలోరిక్స్**

'ఎలస్టోకెలోరిక్ పరిజ్ఞానం' అతి వేగంగా విస్తరిస్తోంది. కండరాల మాదిరిగా ఉష్ణ వ్యవస్థలకు శక్తిని అందిస్తుందని దీన్ని అభివర్ణిస్తున్నారు. ఇలా సుస్థిర పద్ధతిలో చల్లగా ఉండటానికి తోడ్పడుతుంది. భూతాపం, డేటా డిమాండ్ పెరిగిపోతున్న తరుణంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంటోంది. నికెల్, టైటానియం వంటి ఎలస్టోకెలోరిక్ లోహాల గొట్టాలతో కూడిన హీట్ పంపులు యాంత్రిక ఒత్తిడి పడినప్పుడే వేడిని వెలువరిస్తాయి. ఒత్తిడిని తొలగించినప్పుడు చల్లబడతాయి. అందువల్ల సంప్రదాయ కూలింగ్ వ్యవస్థల కన్నా ఇవి తక్కువ విద్యుత్తును వాడుకుంటాయి. వీటికి ఫ్రిజ్‌లలో వాడే పర్యావరణ హానికారక వాయువుల అవసరం లేకపోవటం మరో ప్రయోజనం. విద్యుత్ గ్రిడ్ సదుపాయాలు అంతగా లేని చోట్ల కూడా ఎలస్టోకెలొరిక్ వ్యవస్థలను వాడుకోవచ్చు.


**ప్రత్యామ్నాయ పశు దాణా**

మాంసం, పాల వంటి వాటి కోసం పశువులను పెంచటంలో ప్రొటీన్ ఎక్కువగా లభించే సోయా, తదితర పంటల మీద ఆధారపడుంటారు. వీటిని పండించటం మూలంగా అడవులను నరికివేయటం, జీవవైవిధ్యం కోల్పోవటం, ఎరువులు ఎక్కువగా వాడటం, నేలను మార్చటం వల్ల గ్రీన్‌హౌజ్ వాయువులు వెలువడటం వంటి అనర్థాలు సంభవిస్తున్నాయి. ఇలాంటి ముప్పులను తప్పించటానికి 'ప్రత్యామ్నాయ పశు దాణా' విధానం ఊపందుకుంటోంది. ఏక కణ ప్రొటీన్, ఆల్గే, ఆహార వ్యర్థాలను దాణాగా మలచటం దీని ప్రత్యేకత.

**జన్యు అవయవ మార్పిడి**

అవయవాల మార్పిడి ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతోంది. కానీ తగినంత సంఖ్యలో అవయవాలు అందుబాటులో లేకపోవటమే పెద్ద సవాలు. అధునాతన క్రిస్ప్ఆర్‌కాస్9 వంటి జన్యు సవరణ విధానాలు ఇలాంటి పరిస్థితిని మార్చేస్తున్నాయి. ఈ విధానంతో పందుల్లో జన్యు మార్పిడి ద్వారా వృద్ధి చేసిన మూత్ర పిండాలను ఒకరికి అమర్చటం తెలిసిందే. అతడు రెండు నెలల తర్వాత మరణించినప్పటికీ అవయవ మార్పిడిలో కొత్త శకానికి తెరతీసింది. లోపాలను అధిగమిస్తే అవయవాల కొరతను అధిగమించటం అసాధ్యమేమీ కాదు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# రికార్డు స్థాయిలో విడుదల

ప్రపంచ వ్యాప్తంగా ఆరు భాషల్లో కలిపి 11,500 తెరలపై సినిమా ప్రదర్శితం కానుందని 'పుష్ప2' నిర్మాణ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ భారతీయ సినిమా ఏదీ ఈ స్థాయిలో విడుదల కాలేదని స్పష్టం చేశాయి. అల్లు అర్జున్ కథా నాయకుడిగా, సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. రష్మిక కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'పుష్ప: ది రైజ్'కి కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. భారత దేశంలో 6,500 తెరలపైనా, ఓవర్సీస్‌లో 5000 తెరలపైనా 'పుష్ప2' విడుదలవుతోందని, ఇదొక రికార్డు అని చిత్రవర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఓటీటీ మార్కెట్‌లో రికార్డు స్థాయి వ్యాపారం చేసుకున్న ఈ చిత్రం, థియేటర్లలోనూ అదే స్థాయిలో సందడి చేసే అవకాశాలున్నాయి. ఫహాద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.



## అలా నిరూపిస్తే సినిమాలు మానేస్తా

"వెండితెరపై ఇప్పటి వరకు చెప్పని ఒక కొత్త ఎమోషన్‌ను 'క' చిత్రంతో చూపించనున్నాం. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. సినిమా పూర్తయ్యే సమయానికి ప్రేక్షకులు తప్పకుండా ఆశ్చర్యానికి గురవుతారు'' అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని సుజిత్ సందీప్ సంయుక్తంగా తెరకెక్కించారు. నయన సారిక, తన్వీ రామ్ కథానాయికలు. ఈ చిత్రం ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "వాసుదేవ్ అనే వ్యక్తి కథ ఇది. అతనొక అనాథ. పక్కవారి జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న ఉత్సాహం ఎక్కువ. వేరే వాళ్ల ఉత్తరాలు చదువుతూ వాళ్ల ఎమోషన్స్‌ను ఆస్వాదిస్తుంటాడు. పోస్ట్‌మ్యాన్ అయ్యాక కృష్ణగిరి వెళ్తాడు. మరి అక్కడికి వెళ్లాక ఏం జరిగిందన్నది ఆసక్తికరం. ఇదొక భిన్నమైన సస్పెన్స్ థ్రిల్లర్. ఇలాంటి కథ ఇప్పటి వరకు రాలేదు. ఒకవేళ అలా వచ్చిందని నిరూపిస్తే సినిమాలు మానేస్తా. నా వాసుదేవ్ పాత్రలో అన్ని ఎమోషన్స్ ఉంటాయి. ప్రేక్షకులు తప్పకుండా నన్ను కొత్తగా చూస్తారు'' అన్నారు. "మల్టీప్లెక్స్‌ల కోసం రాసిన కథ కాదిది. బీ,సీ సెంటర్ల ప్రేక్షకుల్ని దృష్టిలో పెట్టుకుని చేశాం. స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. ఏమాత్రం గందరగోళం అనిపించదు'' అన్నారు దర్శకులు సుజిత్, సందీప్. ఈ కార్యక్రమంలో తన్వీ రామ్, నయన్ సారిక, వంశీ నందిపాటి తదితరులు పాల్గొన్నారు.



## మజాకా నాయిక

సంక్రాంతి బరిలో 'మజాకా'తో వినోదాలు పంచనున్నారు సందీప్ కిషన్. ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని త్రినాథరావు నక్కిన తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఇందులో సందీప్‌కు జోడీగా రీతూ వర్మ కనువిందు చేయనుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోను పంచుకుంది. అందులో రీతూ పెళ్లికూతురిలా ముస్తాబై కనిపించింది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమా ప్రస్తుతం వైజాగ్‌లో చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: లియోన్ జేమ్స్, ఛాయాగ్రహణం: నిజార్ షఫీ.



# మాధురి X విద్యాబాలన్

తెరపై ఇద్దరు తారలు నువ్వా నేనా అన్నట్లు స్టెప్పులు వేస్తే.. థియేటర్లలో అభిమానులకు పండగే. ఇప్పుడలాంటి ఓ వేడుకను తమ నృత్య ప్రదర్శనతో పరిచయం చేయబోతున్నామంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటీమణులు మాధురీ దీక్షిత్, విద్యాబాలన్. మరికొద్దిరోజుల్లో కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటించిన 'భూల్ భులయ్యా 3' విడుదలకు సిద్ధమవుతోంది. త్రిప్తి దిమ్రీ కథానాయిక. తాజాగా ఇందులోని 'అమీ జే తోమర్ 3.0' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. "ఇద్దరు లెజెండ్స్ ఒక్కటైతే.. తెరపై వచ్చే మ్యాజిక్ మాటల్లో చెప్పలేనిది'' అని వ్యాఖ్యల్ని జోడించింది. "మీ కలయిక కోసం వేయి కళ్లు ఎదురుచూస్తున్నాయని తెలుసు. నేడు మీరు మళ్లీ విడిపోరని వాగ్దానం చేయండి'' అంటూ సాగుతున్న ఈ గీతంలో మాధురి, విద్యాబాలన్ వారి నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. 'భూల్ భులయ్యా'లోని ఒరిజినల్ ట్రాక్‌కి రీమేక్‌గా తీర్చిదిద్దిన ఈ పాటను శ్రేయా ఘోషల్ ఆలపించారు. అనీజ్ బాజ్మీ తెరకెక్కించిన ఈ చిత్రం నవంబరు 1న విడుదల కానుంది.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657